ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

మంగళవారం 27 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 131 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

రక్షణ రంగానికి భారీ బూస్ట్

రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు- డీపసీ ఆమోదం 2





పార్లమెంట్ సమీపంలో

నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ

అదుపులోకి మంటలు 2



ఎయిర్‌పోర్ట్ తరహాలో

ఆర్టీసీ టెర్మినళ్లు

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ఆర్టీసీ టెర్మినళ్లు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

మంత్రి పొన్నం ప్రకటన

తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ప్రయాణికులకు విమానాశ్రయాల తరహాలో మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు అత్యాధునిక ఆర్టీసీ టెర్మినళ్లను నిర్మించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ టెర్మినళ్లలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులకు కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడం, కొత్త బస్ టెర్మినళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

-హైదరాబాద్, అక్టోబర్ 26 (సింగిడి) 2

విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ

40వ వార్షికోత్సవం



ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి 2

సీఎం ఒక్కరేనా..
కౌంటర్ ఇచ్చేదెవరు!

బొగ్గు దిగుమతులపై కేటీఆర్ రూ.3 వేల కోట్ల ఆరోపణలు

విచారణకు సిద్ధమన్న సీఎం రేవంత్‌రెడ్డి.. యాదాద్రి ప్లాంట్ వ్యయంపై భిన్న వాదనలు

మంత్రులు, ఎమ్మెల్యేల స్పందనపై రాజకీయ చర్చ

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, బొగ్గు కొనుగోళ్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో వేడి పెంచుతోంది. బొగ్గు దిగుమతుల్లో రూ.3 వేల కోట్ల అక్రమాలకు అవకాశం ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శ్వేతపత్రం విడుదల చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ, ఏ సంస్థతో విచారణ జరిపించినా సిద్ధమని ప్రకటించారు. ఈ క్రమంలో విపక్షానికి సమాధానాలు చెప్పడంలో సీఎం చురుగ్గా వ్యవహరిస్తుండగా, మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.



హైదరాబాద్ బ్యూరో - సింగిడి 2



అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు

నవంబరు 2న రాష్ట్రానికి...

బీజేపీ మహాపాదయాత్రలో పాల్గొనున్న కేంద్ర హోం మంత్రి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చే నెలలో తెలంగాణలో పర్యటిస్తారు. నవంబరు 2న ఆయన హైదరాబాద్‌కు వస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌పై విపక్షాలు ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ మహా పాదయాత్రకు సిద్ధమైంది. ఇందులోనే అమిత్ షా పాల్గొంటారని పేర్కొన్నాయి. అయితే, గతంలో బీజేపీ అగ్రనేత తెలంగాణ టూర్ పలు సందర్భాల్లో వాయిదాపడింది. ఈ నేపథ్యంలో ఇప్పుడైనా ఆయన వస్తారా? అనే చర్చ జరుగుతోంది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. నవంబరు 2న ఆయన రానున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు మద్దతుగా బీజేపీ చేపట్టిన '' లోక్‌తంత్ర బచావో.. అరాచకత హటావో' కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేస్తోన్న సంగతి తెలిసిందే.

-హైదరాబాద్, అక్టోబర్ 26 (సింగిడి)

తుమ్మిడిహెట్టిపై కీలక ముందడుగు

152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ ప్రతిపాదన

సానుకూలత వ్యక్తం చేసిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

తెలంగాణలో సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో ఉన్న సమస్యలను పరిష్కరించి, నిర్మాణానికి మార్గం సుగమం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం కీలక చర్చలు జరిపింది. 2



- ముంబయి- సింగిడి

ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరిగిన ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాణహిత నదిపై తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మించనున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, పరిహారం, ఇతర సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముందుగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, ఆదివాసీ ప్రాంతాలు దశాబ్దాలుగా సాగునీరు, తాగునీటి సదుపాయాలకు దూరంగా ఉన్నాయని మహారాష్ట్ర ప్రతినిధులకు వివరించారు.

నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

30 వేల మందితో దీక్షకు సిద్ధమని ప్రకటన

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న

సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని వెల్లడి



తెలంగాణలో సొంత ప్రభుత్వంపైనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చస్తే గానీ బిల్లులు చెల్లించరా? అంటూ ప్రశ్నించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్టపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు.

-హైదరాబాద్, అక్టోబర్ 26 (సింగిడి) 2

మహాలక్ష్మి పథకంతో మహిళలకు

రూ.10,000 కోట్ల ఆదా

290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.. రేవంత్ రెడ్డి స్పందన

రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు వినియోగించుకుంటున్న పథకం

ఈ పథకం మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అన్న సీఎం 2

'క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'

రాహుల్ కేసులో కోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్



పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, ఆ తీర్పును స్వాగతిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది హస్తం పార్టీ. పరువు నష్టం కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించడంతో బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. బీజేపీని నేరస్థులు నడిపే పార్టీగా అభివర్ణించింది.

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సింగిడి)

తిరుపతిలో డీజీపీ, ఐజీల

జాతీయ సదస్సు

హాజరుకానున్న మోదీ, అమిత్ షా

డిసెంబర్ 4 నుంచి 6 వరకు తిరుపతిలో డీజీపీ, ఐజీల సదస్సు

తిరుపతి ఐసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సమావేశం

ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

పారపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం 2



దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వార్షిక సదస్సు ఈసారి తిరుపతిలో జరగనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో పాటు కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సింగిడి)

ఏపీకి అర్ణబ్ తుపాను ముప్పు

ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు.. అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక

గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ

తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన



బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

అమరావతి, అక్టోబర్ 26 (సింగిడి) 2

తెలంగాణకు భారీ వర్ష సూచన

అర్ణబ్ తుపాను ప్రభావం

తెలంగాణలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. 2



స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై

షర్మిల ఫైర్

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం

ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేసి, విచారణ జరపాలని డిమాండ్ 2

గత ప్రభుత్వం చేసిన తప్పులనే కూటమి పునరావృతం చేస్తోందని ఆగ్రహం



రక్షణ రంగానికి భారీ బూస్ట్

రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు- డీపసీ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సింగిడి)

రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, లాంగ్-రేంజ్ కామికాజ్ డ్రోన్లు సహా సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డ్‌గన్ సిస్టమ్, తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, స్వల్ప శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ, కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు, లాంగ్-రేంజ్ కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరోవైపు భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్, ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. అలాగే భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ల సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. కాగా, ఈ రక్షణ పరికరాల్లో దాదాపు 82 శాతం భారత పరిశ్రమల నుంచే కొనుగోలు చేయనున్నారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన

ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు బీజేపీ మహాపాదయాత్ర చేయాలని నిర్ణయించింది. నవంబర్ 1న హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే పాదయాత్రలో నవంబరు 2న అమిత్ షా పాల్గొంటారు.

వాస్తవానికి అమిత్ షా తెలంగాణ పర్యటన గత రెండున్నరేళ్లుగా అనేకసార్లు వాయిదాపడింది. ఈ నెల 3, 4వ తేదీల్లోనే ఆయన తెలంగాణలో పర్యటించాల్సి ఉండగా.. ఆకస్మికంగా రద్దయ్యింది. ఆ పర్యటనలో మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తిచేయగా.. అనూహ్యంగా పర్యటన రద్దుచేసుకున్నారు. అయితే, కారణాలు ఏంటి? అనేది మాత్రం వెల్లడించలేదు.

అమిత్ షా చివరిసారిగా తెలంగాణకు మే 2024లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం వచ్చారు. ఆ తర్వాత వివిధ సందర్భాల్లో షా రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల పర్యటనలు రద్దయ్యాయి. వరంగల్ జిల్లాలో ఓ కార్యక్రమానికి, ఖమ్మం జిల్లాలో బీజేపీ కార్యకర్తలతో భేటీకి, కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు షెడ్యూల్ ఖరారైనా చివరి నిమిషంలో రద్దుకావడం గమనార్హం.

తెలంగాణలో పార్టీ బలోపేతంపై బీజేపీ అధిష్టానం దృష్టిసారించింది. అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్లు సమయం ఉన్నప్పటికీ, అధికారమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రస్థాయి నేతలు పోరాటం చేస్తున్నా.. నేరుగా అగ్రనేతలే రంగంలోకి దిగబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా తదితరులు వచ్చే రెండు నెలల్లో తెలంగాణలో పర్యటించనున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే షా నవంబరులో తెలంగాణకు వస్తున్నట్టు తెలుస్తోంది.

విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం

అమరావతి, అక్టోబర్ 26 (సింగిడి)

భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు

తిరుపతి, అక్టోబర్ 26 (సింగిడి)

డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులందరూ హాజరవుతున్నందున, భద్రత, వసతి, రవాణా తదితర అంశాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. అలాగే, తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్ విధానంలో పాలుపంచుకున్నారు.

'క్రిమినల్స్ నడిపే పార్టీ బీజేపీ'

గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఓడిస్తామని పేర్కొంది. బీజేపీ నేత అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన పరువు నష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్దోషిగా సోమవారం ఉదయం ప్రకటించగా, ఆ తీర్పును కాంగ్రెస్ స్వాగతించింది. నిజం గెలిచిందని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రావడానికి నేరాలకు పాల్పడిన వారిని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఆ పార్టీని ఓడించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే ఆ పోరాటం హింసకు తావులేకుండా మహాత్మా గాంధీ చూపిన మార్గంలోనే సాగుతుందని చెప్పారు. ప్రేమ, కరుణ, పట్టుదలతో బీజేపీని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 2018లో చేసిన వ్యాఖ్యల్లో పరువు నష్టం కలిగించే అంశం లేదని కోర్టు స్పష్టం చేసిందని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమిత్ షాను వ్యక్తిగతంగా కించపరచాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ తరఫున హాజరైన న్యాయవాది వాదించారు.

తుమ్మిడిహెట్టిపై కీలక ముందడుగు





అపారమైన సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పేర్కొన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలు గతంలో తీవ్ర సామాజిక సమస్యలకు కారణమయ్యాయని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలంటే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరమని స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు, మహారాష్ట్ర నాయకుడు ఎస్‌బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి ఇప్పటివరకు సాగిన ప్రయత్నాలను వివరించారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదన్నారు. 2016లో బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే ఈ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణకు అవసరమైన తాగునీరు, సాగునీటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం కష్టమవుతుందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివరించారు.

ప్రస్తుత విద్యుత్ అవసరాలు, పంపింగ్ వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుంటే నీటిని గ్రావిటీ ద్వారా తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచి నిర్మించడం తెలంగాణకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ప్రతిపాదించారు. ఈ ఎత్తు వల్ల కలిగే సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలను వివరించడంతో పాటు మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారమే బాధిత రైతులకు నష్టపరిహారం అందిస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో సరిహద్దు ప్రాంతాలకు ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని కోరారు. గిరిజనుల హక్కుల కోసం కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ సాగునీరు, తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని కేవలం నీటిపారుదల ప్రాజెక్టుగా కాకుండా రెండు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడే వారధిగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. బ్యారేజీ ఎత్తును పెంచాలన్న విజ్ఞప్తిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, మహారాష్ట్ర ప్రజలకు, వ్యవసాయ భూములకు ఎలాంటి ప్రతికూల ప్రభావం కలగకుండా సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన ఒప్పందాన్ని పునఃపరిశీలించే అంశాన్ని కూడా పరిశీలించవచ్చని ఇందుకు అవసరమైన అధ్యయనాలు జరగాలని పేర్కొన్నారు.

ఇందులో భాగంగా ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు పెంపు వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి లభ్యత, మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, పరిహారం, ప్రత్యామ్నాయ సాంకేతిక పరిష్కారాలను కమిటీ పరిశీలించనుంది. అవసరమైన అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం పాత్రపైనా చర్చించారు. అధికారులు, సాంకేతిక నిపుణుల పరస్పర సంప్రదింపులు జరిపి తదుపరి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపునకు తుది ఆమోదం లభించాల్సి ఉంది. ఈ చర్చలు ఫలప్రదమైతే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ముందుకు సాగేందుకు మార్గం సుగమమవుతుందని, తద్వారా ఆదిలాబాద్ ప్రాంతంలో సాగునీటి విస్తరణకు, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది.

సీఎం ఒక్కరేనా.. కౌంటర్ ఇచ్చేదెవరు!

ఒప్పందాల చుట్టూ ఆరోపణలు

బొగ్గు దిగుమతులకు సంబంధించిన ఒప్పందం 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి ప్లాంటుకు ఏటా 1.4 కోట్ల టన్నుల బొగ్గు అవసరమని, అందులో 70 లక్షల టన్నుల దిగుమతికి అప్పట్లో ఒప్పందం చేసుకున్నారని వివరించారు. మరోవైపు, సింగరేణి నుంచి దేశీయ బొగ్గును వినియోగించే అవకాశాలున్నప్పుడు దిగుమతులపై ఎందుకు ఆధారపడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ఒప్పంద నిబంధనలు, ధరలు, సరఫరా సంస్థ వివరాలను బయటపెట్టాలని కోరారు. ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది విచారణతోనే తేలాల్సి ఉంది.

ప్లాంట్ వ్యయంపై భిన్న వాదనలు

యాదాద్రి ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయం రూ.17,950 కోట్ల నుంచి రూ.37,781 కోట్లకు పెరిగిందని సీఎం తెలిపారు. యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.6.60 ఖర్చవుతోందని పేర్కొన్నారు. మరోవైపు, ఇంధన రంగ నిపుణుడు వి. ప్రకాశ్ ప్లాంట్ స్థానం, బొగ్గు నాణ్యత, సాంకేతిక అంశాలపై సీఎం వాదనలను ప్రశ్నించారు. నిర్మాణ వ్యయం ఎందుకు పెరిగింది? బొగ్గు సరఫరా విధానం ఎంత ప్రయోజనకరంగా ఉంది? అన్న అంశాలకు సమగ్ర గణాంకాలతో సమాధానాలు రావాల్సి ఉంది.

మంత్రుల పాత్రపై చర్చ

విపక్ష ఆరోపణలకు సీఎం స్వయంగా స్పందిస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వ విధానాన్ని ప్రజలకు వివరించాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే, నేతలంతా మౌనంగా ఉన్నారని చెప్పడానికి వారి ప్రకటనలను కూడా పరిశీలించాలి. ప్రభుత్వ వాదనను సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్తున్నారా? శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నారా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశం.

ప్రజలకు కావాల్సింది లెక్కలు

ఈ వ్యవహారంలో రాజకీయ విమర్శల కంటే విద్యుత్ ఉత్పత్తి వ్యయం, బొగ్గు కొనుగోళ్ల పారదర్శకత, ప్రజలపై పడే భారమే కీలకం. ఒప్పందాల వివరాలు, ధరలు, సరఫరా పరిమాణాలను ప్రభుత్వం వెల్లడించి, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయి. చివరకు ప్రజలు ఆశించేది రాజకీయ కౌంటర్లు కాదు.. విద్యుత్ రంగంలో పారదర్శకత, సమర్థవంతమైన నిర్వహణ, తమపై అదనపు భారం పడకుండా ఉండే భరోసా.

పార్లమెంట్ సమీపంలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సింగిడి)

దేశ రాజధాని దిల్లీలోని పార్లమెంట్ సమీపంలో ఉన్న నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం ఉదయం భవనం వెనుక వైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు రావడంతో అక్కడ కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆరు వాహనాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. నార్త్ బ్లాక్‌లో ప్రస్తుతం మరమ్మతులు, కొన్ని పనులు జరుగుతున్నాయి. భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అక్కడ ఏర్పాటు చేసిన ఏసీ బాయిలర్ వద్ద మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. వెల్డింగ్ పనుల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సోమవారం ఉదయం 11.10 గంటలకు నార్త్ బ్లాక్ నుంచి పొగలు వస్తున్నట్లు దిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భవనానికి ఎంతమేర నష్టం జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వెల్డింగ్ పనుల సమయంలో మంటలు ఎలా చెలరేగాయి, ఏసీ బాయిలర్ వద్ద ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

ఏపీకి అర్ణబ్ తుపాను ముప్పు

సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

తెలంగాణకు భారీ వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్ణాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. రేపు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ

ఎల్లుండి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా

హైదరాబాద్, అక్టోబర్ 26 (సింగిడి)



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు.

నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

తన నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా?

ప్రభుత్వం, సచివాలయం తీరుపై అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం తాను చనిపోతేనే నిధులు విడుదల చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీళ్ల కోసం పార్టీలకు అతీతంగా పోరాటం

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం నిలబడుతుందని అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని చెప్పారు.

స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై షర్మిల ఫైర్

అమరావతి, అక్టోబర్ 26 (సింగిడి)

రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేద

బండారి లేఔట్ డివిజన్ లో పట్టభద్రుల ఓటు నమోదు అవగాహనా సదస్సు

- అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి
- కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బండారి లేఅవుట్ డివిజన్,పూజిత ఎంక్లేవ్ లో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు నమోదు అవగాహనా సదస్సు బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్ మోహన్ రెడ్డి కి ఓటు వేసి, ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని హన్మంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమం నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,డివిజన్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి నన్నపనేని యశోద దేవి, మురళి, ఆలేటి శ్రీనివాస్ రావు,మౌళేశ్వర్ రావు, రాయల దీపక్ సిద్దనోల సంజీవ్ రెడ్డి, పూజిత ఎంక్లేవ్ అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పిలుపు

- కరీంనగర్ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (సింగిడి): ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన "ఓట్ బచావో -- దేశ్ బచావో" కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు ఎస్. శరత్‌తో కలిసి పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సూచనల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జన సమీకరణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మున్సూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆల్‌ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ కె నగర్ బస్తీలో విజయదశమి ఉత్సవం



మల్కాజిగిరి, అక్టోబర్ 26 (సింగిడి): మల్కాజిగిరి ఆర్ కె నగర్ లోని స్ట్రీట్ నెంబర్ 2 లో ఉన్నటువంటి మైదానంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ యొక్క ఆర్కే నగర్ బస్తీకి సంబంధించినటువంటి విజయ దశమి ఉత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమం కి ముఖ్యఅతిథిగా వనవాసి కల్యాణ ఆశ్రమం కేంద్ర కారిణి సభ్యులు రాంచంద్రయ్య, రిటైర్డ్ ఐటీ ప్రొఫెషనల్ వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం బస్తీల వారిలో దేశవ్యాప్తంగా నిర్వహింపబడుతుందని, చిన్నప్పటి నుంచి పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మన చదువుకునే చదువు దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. భారత్ అన్ని రంగాలలో దూసుకుపోతుందని భవిష్యత్తు భారత దేశానిదే నని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ శ్రవణ్, బాలమురళి, రాంబాబు, రామ్, ప్రభాకర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, అక్టోబర్ 26 (సింగిడి): మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యావంతులు, వివిధ కాలనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి డివిజన్‌లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని సూచించారు.

బాధితురాలికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహాయం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 26 (సింగిడి): వికారాబాద్ జిల్లా దారూర్ మండలం మైలారం తండాకు చెందిన బాధితులకు రెండు లక్షల ఎల్ వో సీ ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం అందజేశారు. మోహన్ నాయక్ కూతురు రామావత్ మహేశ్వరి వైద్య చికిత్స ఖర్చుల కోసం రామావత్ మహేశ్వరి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం పరిస్థితిని తెలుసుకొని మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి, సీ ఎం సహాయ నిధి నుండి మంజూరు అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోహన్ నాయక్ కూతురు రామావత్ మహేశ్వరి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని అన్నారు. రామావత్ మహేశ్వరికి మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే వైద్యులను కోరాను. మోహన్ నాయక్ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అయిన అన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 26 (సింగిడి): జిల్లా పరిధిలోని పెద్దేముల్ మండలం గోపాల్ పురం గ్రామంలో వ్యవసాయ పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు సర్వీస్ వైరు సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో రైతు ప్రాణాలను బలిలైన సంఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా స్వల్ప గాయాలతో మరొకరికి ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తిసాన్ పల్లి బిచ్చప్ప(38) పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు విద్యుత్ సరఫరా కల్పించేందుకు తమ్ముడు అశోక్ తో కలిసి సర్వీస్ వైరు మరమ్మతులు చేస్తున్నాడు. ఈక్రమంలో అశోక్ చెట్టుపై ఉండి కొమ్మలను తొలగిస్తుండగా, బిచ్చప్ప ట్రాన్స్ ఫార్మర్ వద్ద వైరు సరిచేస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో 11 కేవీ విద్యుత్ లైన్ కు జియో వైరు తగలడంతో బిచ్చప్పకు విద్యుదాఘాతం తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన అశోక్ చెట్టుపై నుంచి కిందకు దిగే క్రమంలో గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. వ్యవసాయ పనుల కోసం వెళ్లిన సోదరుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంభం శోకసముద్రంలో మునిగిపోయింది.

బాధితులకు సహాయాన్ని అందించడానికి..

జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంది

సంగారెడ్డి జిల్లాలో 'స్వేచ్ఛారథం' అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ పాండు



సంగారెడ్డి జ్యూరో , అక్టోబర్ 26 (సింగిడి): పెట్టిదాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడం, బాధిత కార్మికులకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియజేయడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 080-69434343 ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా, సంగారెడ్డి జిల్లాలో 'స్వేచ్ఛారథం' ప్రచార వాహనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, కార్మిక దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసే విధానాలు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ మరియు సహాయ వ్యవస్థలపై ప్రజలకు, ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, వెట్టిచాకిరీని నిషేధిస్తూ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించడం, బాధితులను రక్షించడం, వారికి పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీ ఎం. యాదయ్య పాల్గొని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. పెట్టిదాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు పెట్టిదాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులపై ఈ ప్రచార కార్యక్రమం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. జిల్లాస్థాయి ప్రారంభ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, డీఎస్పీ శ్రీ సతయ్య , పోలీసు శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళామరియు శిశు అభివృద్ధి శాఖ, బాలల సంక్షేమ కమిటీ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందించనుంది. ఇందులో భాగంగా సమాచార, విద్య, కమ్యూనికేషన్ సామగ్రి ద్వారా అవగాహన కల్పించడంతో పాటు, టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌నంబర్‌పై ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించనున్నారు. తెలంగాణ కార్మిక శాఖ సెప్టెంబర్ 29, 2026న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మేజిస్ట్రేట్లకు జారీ చేసిన సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం, ప్రచార కార్యక్రమాల నిర్వహణ, హెల్ప్‌లైన్ సమాచారం ప్రజలకు చేరవేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ , మీడియా అకాడమీ సహకారంతోనూ ప్రచారాన్ని విస్తృతం చేయనున్నారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం లేదా ప్రతీకార చర్యలకు భయపడటం వల్ల వెట్టిదాకిరీ ఘటనలు వెలుగులోకి రాకపోవచ్చు. అప్పులు, అడ్వాన్సులు, బెదిరింపులు, బలవంతం, మోసం, వేతనాలు నిలిపివేయడం లేదా పని నుంచి స్వేచ్ఛగా బయటకు వెళ్లనివ్వకపోవడం వంటి పరిస్థితులు కార్మికులను వెట్టిచాకిరీలో చిక్కుకునేలా చేయవచ్చు. 'స్వేచ్ఛారథం' ప్రచారం ద్వారా వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, బాధితులకు ఎలాంటి సహాయం అందుబాటులో ఉంది, ప్రభుత్వ అధికారులు ఎలా స్పందిస్తారు అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ రాష్ట్రవ్యాప్త ప్రచారం తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో కొనసాగుతుంది. ప్రతి జిల్లాలో జిల్లా యంత్రాంగాల ఆధ్వర్యంలో కార్మిక శాఖ, పోలీసు శాఖ, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

స్వేచ్ఛారథం గురించి :-

'స్వేచ్ఛారథం' అనేది పెట్టిదాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించడంతో పాటు, బాండెడ్ లేబర్ హెల్ప్ లైన్ నంబర్ 080-69434343ను ప్రజలకు చేరువ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమం. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రచార వాహనాల ద్వారా కార్మికులు, ప్రజలకు వెట్టిచాకిరీ గుర్తింపు, ఫిర్యాదు విధానాలు, రక్షణ మరియు పునరావాస సేవలపై సమాచారం అందించడమే దీని ప్రధాన లక్ష్యం. వెట్టిచాకిరీ గురించి వెట్టిచాకిరీ అనేది బలవంతపు శ్రమకు సంబంధించిన ఒక రూపం. అప్పు, అడ్వాన్సు లేదా ఇతర ఆర్థిక బాధ్యతల పేరుతో ఒక వ్యక్తిని బలవంతంగా పని చేయించడం, పని నుంచి స్వేచ్ఛగా బయటకు వెళ్లకుండా నిరోధించడం వంటి పరిస్థితులు ఇందులోకి వస్తాయి. కొన్ని సందర్భాల్లో ఈ దోపిడీ కుటుంబ సభ్యులకు కూడా విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు మరింత ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. భారత చట్టాల ప్రకారం వెట్టిచాకిరీ నిషేధించబడింది. ఇటువంటి దోపిడీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయం అందించడం సంబంధిత అధికారుల బాధ్యత. అందువల్ల ప్రజలు అనుమానిత వెట్టిచాకిరీ ఘటనలను గుర్తించినప్పుడు బాండెడ్ లేబర్ హెల్ప్ లైన్ నంబర్ 080-69434343 ద్వారా సమాచారం అందించి, బాధితులకు సహాయం అందేలా తోడ్పడాలని కోరుతున్నారు.

ఎన్నా చెరువులో భారీ శుభ్రత కార్యక్రమం

400 మందితో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హాట్రిక్ ఎంఎల్ఏ కె పి వివేకానంద ఆదేశాలతో ఈ కార్యక్రమం సూచిత్ర వెన్నెలగడ్డ జీడిమెట్ల గ్రామంలోని ఎన్నా చెరువు కట్ట మీద, నీటి లోపల పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను శుభ్రం చేసే కార్యక్రమం అదివారం చేపట్టారు. అస్సేజ్ వ్ఆ (ూూజ్ఞు ఔూూ) అంతర్జాతీయ సేవ స్వచ్ఛంద సంస్థ వారు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, జీడిమెట్ల డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ూూజ్ఞు ఔూూ ప్రతినిధులు, వారి సిబ్బందితో కలిసి ఎన్నా చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ రహితంగా చేయుటకు ఈ శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది పాల్గొని చెరువు కట్ట మీద ఉన్న వ్యర్థాలను, నీటిలో నిల్వ ఉన్న ప్లాస్టిక్ సంచులను తొలగించి చెరువును ప్లాస్టిక్ రహితంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవరెడ్డి, గంధం సుధాకర్, బచ్చ జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, బాల మల్లేష్, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ యువకులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ మాట్లాడుతూ ఈ రోజు నుండి చెరువు నీటిలో, కట్ట మీద ఎవరు కూడా చెత్త వేయరాదని, ఒకవేళ చెత్త వేసినచో 5000/- జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ చెరువుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నాచారం, అక్టోబర్ 26 (సింగిడి): నాచారం సర్కిల్ హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో చేపట్టనున్న రూ. 2 కోట్ల 7 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వర్షపు నీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పనులు దోహదపడనున్నాయి. ఇందిరానగర్ లెట్ట్ వీధి నంబర్లు 2, 3, 4, 5, 7లో సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ. 49.80 లక్షలు. జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద డ్రైనేజీ, వర్షపు నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు రూ. 70.20 లక్షలు. సరస్వతీ నగర్ మెయిన్ రోడ్డు నుంచి హెచ్ఎంటీ నగర్ స్ట్రీట్ నంబర్ 5 వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం రూ. 39.40 లక్షలు. బాపూజీ నగర్ రోడ్డు నంబర్లు 1, 2లో సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ. 49.80 లక్షలు. అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 2.07 కోట్ల నిధులు కేటాయించగా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిజెన్ శేఖర్, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోండి : రాగిరి మోహన్ రెడ్డి



నాచారం, అక్టోబర్ 26 (సింగిడి): ఎస్సీ మోర్చా అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీముర్తి నాగరాజ్ అధ్యర్యంలో కార్తికేయ నగర్ లైబ్రరీ దగ్గర ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నమోదు కార్యక్రమం విజయవంతం జరిగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు రాగిరి మోహన్ రెడ్డి, కాటేపల్లి రవీందర్ రెడ్డి, అంపలా అనిత పద్మ రెడ్డి, మల్కాప్రకాష్, పాదం వెంకటేష్, జ్యోతి,ఆర్ కే తదితరులు పాల్గొన్నారు.

మతస్థలాల పునర్నిర్మాణం చేపట్టాలి : ఎస్ ఎం. గౌసన్



కొడంగల్, అక్టోబర్ 26 (సింగిడి): కొడంగల్ పట్టణంలో అభివృద్ధి పనుల పేరిట తొలగించిన మహిబూబ్ సుభాని దర్గా, ఇతర మతస్థలాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏడాది గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని కొడంగల్ మాజీ ఉప సర్పంచ్, మైనారిటీ నాయకుడు ఎస్.ఎం. గౌసన్ అన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొడంగల్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి దర్గా, ఇతర మతస్థలాల పునర్నిర్మాణ సమస్యను వివరించేందుకు ప్రయత్నించగా, పోలీసులు తనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని గౌసన్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. ఈ నెలాఖరులోగా దర్గా, ఇతర మతస్థలాల పునర్నిర్మాణంపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్ 5న కొడంగల్‌లో ముస్లిం మైనారిటీలతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఎస్.ఎం. గౌసన్ హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ శ్రీనివాసనగర్ కాలనీలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప దీక్షాదారుల కోసం ఈరోజు నుండి డిసెంబర్ 20 వరకు ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధన (నిత్య అన్నదాన) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ నాచారం మురళి యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, ఇంద్రకుమార్ దేవ్, సతీష్, హరిబాబు, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు, దీక్షాదారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శిల్ప ఫైన్ వ్యాలీలో సీసీ రోడ్డు ప్రారంభించిన హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని శిల్ప ఫైన్ వ్యాలీలో గత కొన్నేళ్లుగా మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెలలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి సహకారంతో స్థానికులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సిఎంసీ ఫండ్స్ ద్వారా 99 లక్షల రూపాయలు తో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం శిల్ప ఫైన్ వ్యాలీలో చేపట్టిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజాశేఖర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బీహెచ్ఈఎల్ టు శబరిమల

ఘనంగా మూడవ మహా పాదయాత్ర ప్రారంభం

భక్తుల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించిన బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి



రామచంద్రపురం, అక్టోబర్ 26 (సింగిడి): రామచంద్రపురం మండల్ పరిధిలోని బీహెచ్ఈఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమల క్షేత్రానికి అయ్యప్ప భక్తులు చేపట్టిన మూడవ మహా పాదయాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ముఖ్య నిర్వాహకులు నవరి శ్రీకాంత్ రెడ్డి, నారాయణగారి శ్రీకాంత్ రెడ్డి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భక్తులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్

ఎడిటోరియల్

Editorial

సైనికుల త్యాగాల పునాదులపై

భరతమాత శ్రేయస్సు

(27 అక్టోబర్ "భారత పదాతిదళాల (ఇన్ఫాంట్రీ) దినోత్సవం"

స్వతంత్ర భారతంలో అంతర్భాగమైన జమ్ము – కాశ్మీర్‌లోకి అక్రమంగా చొరబడే ప్రయత్నాలు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత వేర్పాటువాదులకు బుద్ధి చెప్పడానికి "ఆపరేషన్ గుల్మార్గ్" పేరుతో 27 అక్టోబర్ 1947 రోజున "సిక్ ఇన్‌ఫాంట్రీ లేదా పదాతిదళాల" వీర జవాన్లు సాయుధ కవాతులు, మోతలతో చొరబాచుదారులను నిలువరించి భారత భూభాగాన్ని కాపాడిన శుభ సందర్భంగా ప్రతి ఏట 27 అక్టోబర్ రోజు భారత ఆర్మీ అత్యంత దేశ భక్తితో "ఇండియన్ ఇన్‌ఫాంట్రీ (భారత పదాతిదళాల తలసేన) దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. ఇండియన్ ఆర్మీలో అత్యంత శక్తివంతమైన పదాతిదళాలు దేశ రక్షణలో ముందు నిలిచి దేశానికి రక్షణ గోడలుగా నిలుస్తున్నారు. ఈ విధి నిర్వహణలో ప్రాణాలను సహితం అర్పించిన ఇండియన్ ఇన్‌ఫాంట్రీ అమరవీరులకా నివాళులు అర్పించడం, వారి కుటుంబాలకు చేయూతగా నిలవడం, గాయపడిన వీర సైనికులకు మానసిక స్థైర్యాన్ని చేకూర్చడం లాంటి పలు దేశభక్తితో కూడిన కార్యక్రమాలను మనస్ఫూర్తిగా నిర్వహించడం జరుగుతుంది. దేశ భద్రత, సమగ్రత సాధనలో ఇండియన్ ఇన్‌ఫాంట్రీ చేస్తున్న సేవలు, వారు ప్రతిదర్శించే అంకితభావం, త్యాగశీలత, అపూర్వ ధైర్య సాహసాలకు సలాం చేయడం ప్రతి భారతీయుడి కనీస కర్తవ్యం.

క్వీన్ ఆఫ్ బ్యాటిల్ :

భారత ఆర్మీలోని అతి పెద్దవైన పదాతిదళాలను "క్వీన్ ఆఫ్ బ్యాటిల్(యుద్ధ రాణి)"గా పిలుస్తారు. ఇన్‌ఫాంట్రీ దళాలు సుద్ధంలో ముందు నిలబడి శత్రువుల గుండెల్లో వణుకును పుట్టించి విజయ హారాలను భరతమాత మెడలో వేస్తారు. వీరు మిలిటరీ వాహనాలు, మెంట్లు లాంటి అనేక శక్తివంతమైన ఆయుధాలను వాడి దేశాన్ని రక్షించడంలా జరుగుతుంది. 01 ఏప్రిల్ 1895లో ప్రారంభమైన ఇండియన్ ఆర్మీలో అత్యంత ప్రధానమైనవి, శక్తివంతమైనవి, అత్యాధునిక ఆయుధాలు కలిగిన భారత పదాతి దళాలు ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన బలగాలుగా పేరును పొందాయి. స్వతంత్ర భారతం ఎదుర్కొన్న నాలుగు ఇండో–పాక్ యుద్ధాలు, ఒక ఇండో–చైనా యుద్ధంలో మన పదాతిదళాలు అత్యంత శౌర్య పరాక్రమాలను ప్రదర్శించి భారత సైన్యం యొక్క వీరత్వాన్ని ప్రపంచ మానవాళికి చవి చూపారు. ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ మేఘదూత్, ఆపరేషన్ కాక్టస్, ఆపరేషన్ బ్రాస్‌టాక్స్, విదేశాల్లో పలు ఐరాస శాంతి స్థాపన మిషన్లలో మన ఇన్‌ఫాంట్రీ తన సత్తాను పలుమార్లు రుజువు చేసింది. ప్రపంచంలోనే నాలుగవ అతి పెద్ద ఆర్మీగా పేరుగాంచిన ఇండియన్ ఆర్మీకి కళికితురాయి వలె ఇన్‌ఫాంట్రీ నిలుస్తున్నది.

ప్రముఖ భారత పదాతిదళ రెజిమెంట్లు:

భారత పదాతిదళాల్లో గోర్కారైఫిల్స్, గ్రెనడీర్స్, గార్డ్స్, బీహార్, పారాచూట్, మద్రాస్, మరాఠా, గార్వాల్ రైఫిల్స్, రాజ్‌పుతానా, ఝాట్, సిక్, డోగ్రా, సిక్ లైట్ ఇన్‌ఫాంట్రి, కమావున్, అస్సాం, మహర్, నాగా, లడక్ స్కౌట్స్, అరుణాచల్, రాష్ట్రీయ రైఫిల్స్, మెఖనైజ్డ్ లాంటి రెజిమెంట్లలు అవిశ్రాంత సేవలను అందిస్తున్నాయి. భారత పదాతిదళాల్లో ముఖ్యమైనవిగా పారాచూట్, రాజ్‌పూత్, బీహార్, గోర్కా, కుమావూన్ లాంటి పలు పదాతిదళాలు తమ సత్తాను సాటి దేశ కీర్తిని ఇనుమడింపజేశాయి. యుద్ధ క్షేత్రంలో గెలుపోటములను నిర్ణయించేది పదాతిదళాలు మాత్రమే. యుద్ధభూమిలో ముందడుగు లేదా వెనకడుగు వేయడానికి ఇన్‌ఫాంట్రీ మాత్రమే తగు నిర్ణయాలను తీసుకుంటుంది. ఆధునిక యుద్ధ సామాగ్రి, కఠోర శిక్షణ, అధునాతన ఆయుధాలను స్వంతం చేసుకున్న పదాతిదళాలు ప్రపంచంలోనే అత్యుత్తమ ఇన్‌ఫాంట్రీగా పేరు నిలుపుకుంటున్నాయి.

సైనిక త్యాగాల పునాదుల మీద ప్రజలు సుఖంగా నిద్రించడం జరుగుతోంది. వారి బలిదానాలు మనకు స్వేచ్ఛను ఇస్తున్నాయి. వారి అమరత్వం భరతమాత కంట కన్నీటి ధారలను కురిపిస్తున్నది. భారత సైనిక బలగాలు మనకు గర్వకారణంగా నిలుస్తూ, ప్రపంచ చిత్రపటంలో ఒక అత్యుత్తమ ఆయుధ శక్తిగా నిలుస్తున్నది.

కెప్టెన్: డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్షతో

అమరుడైన జతీంద్ర నాథ్

అక్టోబర్ 27...జతీంద్ర నాథ్ దాస్ జయంతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో త్యాగధనులు లక్ష్య సాధన కోసం ఆత్మార్పణం గావించారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తాడు జతీంద్ర నాథ్ దాస్. 1929లో 25 ఏళ్ల చిన్న వయస్సులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 63 రోజుల నిరాహార దీక్ష కొనసాగించి ప్రాణ త్యాగం చేసి అమరుడు అయినాడు



జతీంద్ర.

జతీంద్రనాథ్ దాస్ (27 అక్టోబర్ 1904 -– 13 సెప్టెంబర్ 1929) స్ఫూర్తిదాయక స్వాతంత్ర్య సమర యోధుడు, మానవ హక్కుల కార్యకర్త, విప్లవ వీరుడు. కలకత్తాలో 1904 అక్టోబర్ 36న జన్మించాడు. చిన్నవయసు లోనే బెంగాల్లోని అనుశీలన్ సమితి అనే విప్లవ సంస్థ (20వ శతాబ్దపు భారతీయ విప్లవ సంస్థ)లో చేరాడు. భగత్ సింగ్, హిందుస్థాన్ రిపబ్లికన్ సోషలిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పనిచేశాడు. 17 ఏళ్ల వయసులో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణో ద్యమంలో కూడా పాల్గొన్నాడు.

కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజీలో బి.ఎ. చదివే సమయంలో 1925 నవంబరులో రాజకీయ కార్యకలాపాల కారణంగా అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నాడు. అక్కడ రాజకీయ ఖైదీలపట్ల చూపుతున్న దురుసు ప్రవర్తనకు నిరసనగా నిరాహారదీక్ష చేపట్టాడు. 20రోజుల నిరాహార దీక్ష తరువాత జైలు సూపరింటెండెంట్ క్షమాపణ కోరడంతో దీక్ష విరమించాడు. దేశంలోని అన్ని ప్రాంతాలనుండి విప్లవ కారులు బాంబుల తయారీకి ఆయన్ను సంప్రదించేవారు. సచీంద్రనాథ్ సన్యాల్ వద్ద బాంబులను తయారు చేయడం నేర్చు కున్నాడు.. భగత్ సింగ్, మరికొందరు విప్లవ వీరులకు బాంబులను తయారు చేశాడు. ఆయన విప్లవ కార్యకలాపాల కారణంగా ఆయనను 1929 జూన్ 14న అరెస్ట్ చేసి లాహోర్ జైలులో పెట్టారు. లాహోర్ జైలులో భారతీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వారు అనేక రోజుల పాటు ఉతకని, మాసిన దుస్తులను ధరించవలసి వచ్చేది. వంటశాలలో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతూ ఆహార పదార్థాలను తినడానికి హానికరంగా మార్చేవి. భారతీయ ఖైదీలకు వార్తా పత్రికలను, వ్రాసుకోవడానికి కాగితాలు ఇచ్చేవారు కాదు. కానీ అదే జైలులో బ్రిటిష్ ఖైదీల పరిస్థితి దీనికి భిన్నంగా పక్షపాతంగా ఉండేది. జతీంద్ర నాథ్ పరిస్థితులను గమనించి యూరోపియన్ ఖైదీలకు సమానంగా భారతీయ ఖైదీలకు సదుపాయాలను కల్పించాలని కోరుతూ కొందరు విప్లవ కారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షను చేపట్టాడు. ఆమరణ నిరాహార దీక్ష 1929 జూలై 13 న ప్రారంభమై 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు బలవంతంగా దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు జైలు కమిటీ ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రభుత్వం దానిని త్రోసి పుచ్చుతూ బెయిల్ మీద విడుదల కావచ్చని సూచించింది. జతీంద్ర నాథ్ దాస్ భగత్ సింగ్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు కూడా లాహోర్ సెంట్రల్ జైలులో ఈ నిరాహార దీక్ష కొనసాగించారు. జతీంద్ర దాస్ బ్రిటిష్ అధికారులచే దౌర్జన్యాలు, కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఫలితంగా అనారోగ్యం ఆవహించింది. ఊపిరితిత్తులకు హాని కలిగింది. పక్షవాతం శరీర భాగాలకు వ్యాపించడం ప్రారంభించింది. అయినప్పటికీ ఆయన నిరాహార దీక్ష కొనసాగించాడు. అలా ఆయన 1929, సెప్టెంబరు 13వ తేదీన తుది శ్వాస విడిచాడు. విప్లవ వనిత దుర్గావతి దేవి నేతృత్వంలో ఆయన అంతిమ యాత్ర లాహోర్ నుండి కలకత్తా వరకు రైలులో కొనసాగింది. వేలాది మంది శ్రద్ధాంజలి ఘటించడానికి రైల్వే స్టేషన్లకు తరలి వచ్చారు. హౌరా రైల్వే స్టేషన్‌లో శవపేటికను సుభాష్ చంద్రబోస్ స్వీకరించి శవయాత్రకు నేతృత్వం వహించాడు. కలకత్తాలో రెండు మైళ్ళ పొడుగున ప్రజలు బారులు తీరి ఆయనకు తుది వీడ్కోలు చెప్పారు. జతిన్ దాస్ నిరాహార దీక్ష బ్రిటిష్ పాలకుల అక్రమ నిర్బంధాలపై ప్రతిఘటనలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది.

సుభాష్ చంద్రబోస్ ఆ త్యాగశీలిని "భారత దేశపు యువ దధీచి"గా లక్ష్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పురాతన భారతీయ ఋషిగా అభివర్ణించాడు. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" సినిమాలో జతిన్ దాస్ పాత్రను అమితాబ్ భట్టాచార్జీ పోషించాడు.

రాము కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదం

అక్టోబర్ 27... కొమురం భీం వర్ధంతి సందర్భంగా ...



ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.



నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.

ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

-రాము కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

- మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఎస్. స్వప్న



కామారెడ్డి అక్టోబర్ 26 (సింగిడి): సింగూరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో బల్క్ నీటి సరఫరాలో మార్పులు చేపట్టారు. ఎల్‌నినో ప్రభావంతో జలాశయంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్లు బాన్సువాడ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. స్వప్న సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

నియోజకవర్గాల వారీగా నీటి సరఫరా

ఈ నెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు, 29న బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు బల్క్ నీటిని సరఫరా చేయనున్నట్లు ఈఈ తెలిపారు. జలాశయంలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని సరఫరా నిర్వహణలో ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు.

నీటి పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం అత్యంత అవసరమని ఎస్. స్వప్న సూచించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని, అవసరాలకు అనుగుణంగా నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు. అలాగే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. వేసవి పరిస్థితులు, జలాశయంలో నీటి నిల్వల తగ్గుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నీటి కొరతను అధిగమించేందుకు ప్రజలు అధికారులకు సహకరిస్తూ, నీటి వినియోగంలో పొదుపు పాటించాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఎస్. స్వప్న కోరారు.

ఏఐసీసీ పరిశీలకులు ఆసన్ మౌలానాకు ఘన స్వాగతం

- హైదరాబాద్ విమానాశ్రయంలో కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మర్యాదపూర్వక ఆహ్వానం



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 26(సింగిడి): 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చేరుకున్న ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ జె. ఎం. హెచ్. ఆసన్ మౌలానాకు ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆసన్ మౌలానాకు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం కీలకమని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కుల పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పార్టీ తరపున చేపట్టే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపాయి. కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని ఏఐసీసీ పరిశీలకుడికి స్వాగతం పలకడం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

రాష్ట్ర మహాసభల విజయానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలి

బాన్సువాడలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సన్నాహక సమావేశం

నవంబర్ 15లోగా మండల, జిల్లా కమిటీల

పునర్నియామకం పూర్తి చేయాలి : రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్



కామారెడ్డి అక్టోబర్ 26 (సింగిడి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్‌లో నిర్వహించనున్న నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్‌లో రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాసభల నిర్వహణ, సంఘం బలోపేతం, కమిటీల పునర్నియామకంపై సమావేశంలో చర్చించారు.

మహాసభల విజయానికి సమష్టి కృషి అవసరం

ఈ సందర్భంగా కొంగల వెంకట్ మాట్లాడుతూ.. డిసెంబర్‌లో జరగనున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు మహాసభల్లో మరుకుగా పాల్గొని సంఘ ఐక్యతను చాటాలని కోరారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహాసభలకు ఇప్పటి నుంచే అవసరమైన సన్నాహాలు చేపట్టి, కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 15లోగా కమిటీల పునర్నియామకం

సంఘం కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల, జిల్లా కమిటీల పునర్నియామక ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. కమిటీల బలోపేతం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభలను సంఘ భవిష్యత్ కార్యాచరణకు వేదికగా మలుచుకోవాలని, ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ సంఘ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు హీరాలాల్, చంద్రశేఖర్, సురేందర్, గణపతి, క్యాకయ్య, బాన్సువాడ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బిచ్కుంద ప్రధాన కార్యదర్శి వసంత్‌తో పాటు ప్రవీణ్, దశరథ్, ప్రకాష్, సురేందర్, లక్ష్యనాయక్, తారాచంద్, గైనీ శంకర్, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడంతోపాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మంత్రి సీతక్క రాక

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..



కామారెడ్డి అక్టోబర్ 26 (సింగిడి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మంగళవారం, అక్టోబర్ 27న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీమతి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ హాజరుకానున్నారు. నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తరపున స్వాగతం పలికారు. ఈ పర్యటనతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలపై ఈ పర్యటనలో ప్రాధాన్యత ఉంది.

అతివేగం.. మృత్యుమార్గం!

రహదారులపై నిర్లక్ష్యం.. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 26(సింగిడి): నేటి ఉరుకుల పరుగుల జీవితంలో సమయానికి గమ్యస్థానానికి చేరుకోవాలనే ఆత్రుత మనిషిని ప్రమాదకరమైన ప్రయాణాల వైపు నడిపిస్తోంది. ముఖ్యంగా రహదారులపై అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. క్షణకాలం ఆదా చేసుకోవాలనే తొందరలో విలువైన ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

వేగమే లక్ష్యంగా.. భద్రతను విస్మరిస్తూ!

రోడ్లపై ప్రయాణించే సమయంలో కొందరు వాహనదారులు వేగ నియంత్రణను పూర్తిగా విస్మరిస్తున్నారు. పట్టణాలు, గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు అనే తేడా లేకుండా వాహనాలను వేగంగా నడుపుతూ ఇతర ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించకపోతే చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. అతివేగంతో పాటు అజాగ్రత్తగా ఓవర్‌టేక్ చేయడం, ఎదురుగా వచ్చే వాహనాలను పట్టించుకోకపోవడం, మలుపుల వద్ద వేగాన్ని తగ్గించకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయి. రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం



ట్రాఫిక్ నిబంధనలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు.. వారి ప్రాణాలను కాపాడటానికే రూపొందించబడ్డాయి. వేగ పరిమితులను పాటించడం, సీట్‌బెల్ట్ ధరించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించడం, వాహనాన్ని నడిపేటప్పుడు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు ప్రమాదాల తీవ్రతను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, అలసటతో డ్రైవింగ్ చేయడం, వాహన సామర్థ్యానికి మించి సరుకు రవాణా చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. రహదారులపై సూచిక బోర్డులు, వేగ పరిమితులు, ట్రాఫిక్ సంకేతాలను తప్పనిసరిగా గమనించాలి.

ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు!

ఒక వ్యక్తి నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల అతడికే కాకుండా ఎదురుగా వచ్చే వాహనదారులకు, పాదచారులకు, ఇతర ప్రయాణికులకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టగలదు. అందుకే వాహనం నడిపే ప్రతి ఒక్కరూ వేగం కంటే భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడటం కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. వాహనం నడిపే ముందు దాని పరిస్థితిని పరిశీలించడం, ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండటం, అవసరమైన విశ్రాంతి తీసుకోవడం వంటి చర్యలు ప్రతి డ్రైవర్ బాధ్యతగా భావించాలి.

అధికారుల పర్యవేక్షణ.. ప్రజల్లో అవగాహన అవసరం

రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకరమైన ఓవర్‌టేకింగ్ వంటి ఉల్లంఘనలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రహదారుల పరిస్థితులను మెరుగుపరచడం కూడా అవసరం. పాఠశాల స్థాయి నుంచే రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన వాహనదారులను తీర్చిదిద్దవచ్చు. వాహనదారులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది.

వేగం తగ్గించండి.. జీవితాన్ని కాపాడుకోండి!

రహదారిపై ప్రతి ప్రయాణికుడి గమ్యం సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే కావాలి. కొన్ని నిమిషాలు ఆలస్యమైనా నష్టం లేదు.. కానీ నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదం జీవితాంతం తీరని లోటును మిగిల్చవచ్చు. కాబట్టి వేగాన్ని నియంత్రించండి, ట్రాఫిక్ నిబంధనలను గౌరవించండి, ఇతరుల ప్రాణాలకు విలువ ఇవ్వండి. గుర్తుంచుకోండి.. రహదారిపై మీ బాధ్యతాయుతమైన ప్రయాణమే మీ కుటుంబానికి భరోసా. అతివేగం వద్దు.. సురక్షిత ప్రయాణమే ముద్దు!



కామారెడ్డి ప్రతినిధి రవీందర్ జర్నలిస్ట్

గాంధారి ఏటీఎం చోరీ ముఠా గుట్టురట్టు!

రాజస్థాన్‌లో ప్రధాన నిందితుడి అరెస్టు..

పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు

ఎస్పై పుష్పరాజ్, కానిస్టేబుల్ అజార్ ఫరూక్‌కు నగదు బహుమతి, ప్రశంసాపత్రం



కామారెడ్డి అక్టోబర్ 26 (సింగిడి): కామారెడ్డి జిల్లా గాంధారిలో సంచలనం సృష్టించిన ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్రస్థాయిలో ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు రషీద్‌ను రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి, నిందితుడి పట్టివేతలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్, కానిస్టేబుల్ అజార్ ఫరూక్‌లకు ఎస్పీ తన చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కేసు ఛేదనలో పోలీసు సిబ్బంది సమన్వయం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం కీలకంగా నిలిచాయి.

రూ. 25.45 లక్షల నగదు చోరీ

గాంధారి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో అక్టోబర్ 10,11న మధ్య అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్యాస్ కట్టర్ సహాయంతో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, నగదు ఉన్న ఐదు బాక్సులను అపహరించారు. ఈ ఘటనలో మొత్తం రూ. 25,45,900 నగదు చోరీకి గురైనట్లు బ్యాంకు ప్రతినిధి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గాంధారి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 220/ 2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకున్న జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

నకిలీ నంబర్ ప్లేట్లతో పోలీసుల కళ్లుగప్పే ప్రయత్నం

పోలీసుల దర్యాప్తులో నిందితులు పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనాన్ని ఉపయోగిస్తూ, అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ల స్థానంలో ఇతర వాహనాలకు చెందిన నంబర్ ప్లేట్లను అమర్చి పోలీసుల కళ్లుగప్పేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. సెప్టెంబర్ 2026లో కరీంనగర్ ప్రాంతంలోని రెండు ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద కూడా ఇదే తరహాలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. గాంధారికి చేరుకునే ముందు ఓ వెల్డింగ్ షాపు తాళం పగలగొట్టి ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు ఇతర పరికరాలను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఏటీఎం వద్దకు చేరుకున్న నిందితులు ముఖాలకు మాస్కులు, తలకు క్యాప్‌లు ధరించడంతో పాటు నైటీలు వేసుకుని తమ గుర్తింపును దాచే ప్రయత్నం చేశారు. ఏటీఎంలోని సీసీటీవీ కెమెరాలపై నల్లరంగు స్ప్రే చేసి, గ్యాస్ కట్టర్‌తో యంత్రాన్ని ధ్వంసం చేసి నగదుతో ఉన్న బాక్సులను స్కార్పియో వాహనంలో తీసుకెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఐదు రాష్ట్రాల మీదుగా పోలీసుల గాలింపు

చోరీ జరిగిన వెంటనే రంగంలోకి దిగిన కామారెడ్డి జిల్లా పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, వాహన సమాచారాన్ని విశ్లేషించారు. నిందితులు మహారాష్ట్ర, రాజస్థాన్ వైపు పారిపోయినట్లు గుర్తించి ఆయా రాష్ట్రాల పోలీసులకు సమాచారం అందించారు. రాజస్థాన్‌లోని చేచాట్ ప్రాంతంలో పోలీసులు వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, స్కార్పియో వాహనం టైరు దెబ్బతిన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నిందితులు వాహనాన్ని వదిలి నగదు ఉన్న బ్యాగుతో సహా పరారైనట్లు పోలీసులు తెలిపారు. అయినప్పటికీ కామారెడ్డి పోలీసు బృందాలు వెనుకడుగు వేయకుండా రాజస్థాన్‌లో గాలింపు కొనసాగించాయి. అక్టోబర్ 20న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బరోడామేవ్ సమీపంలోని భరత్‌పూర్ రోడ్డుపై బస్సు కోసం వేచి ఉన్న రషీద్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయస్థానం ద్వారా ట్రాన్సిట్ వారెంట్ పొంది కామారెడ్డికి తీసుకొచ్చారు. అక్టోబర్ 21న చేచాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న నల్లరంగు స్కార్పియో వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఇతర పనిముట్లు, నంబర్ ప్లేట్లతో పాటు వాహనం వెనుక సీటు కింద దాచిన ఇనుప కత్తులు, ఇనుప రాడ్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నగదు, వాహనం, పరికరాలు స్వాధీనం

ఈ కేసులో నిందితుడి నుంచి రూ. 29,400 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనం, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్‌కు సంబంధించిన సామగ్రి, రెగ్యులేటర్, పైపులు, స్క్రూడ్రైవర్, ఇనుప రాడ్లు, వివిధ నంబర్ల ప్లేట్లు, మాస్కులు, దుస్తులు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన రషీద్‌ను అక్టోబర్ 26న న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

పోలీసు బృందానికి ఎస్పీ ప్రశంసలు

అంతర్రాష్ట్ర ఏటీఎం చోరీ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్, ఐటీ కోర్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సీసీఎస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మీకాంత్, సదాశివనగర్ కానిస్టేబుల్ అజార్ ఫరూక్‌లను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు. నేరం జరిగిన ప్రాంతం నుంచి ప్రారంభమైన దర్యాప్తు ఐదు రాష్ట్రాల మీదుగా సాగినప్పటికీ, ఆధారాలను సేకరిస్తూ నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో పోలీసు బృందాలు సమర్థంగా పనిచేశాయని ప్రశంసించారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంలో, అంతర్రాష్ట్ర నేరాలను అరికట్టడంలో పోలీసుల సమన్వయం, అంకితభావం కీలకమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

వరంగల్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలి

గాంధారిలో భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో రైతుల ఆందోళన..

300 మంది రైతుల భాగస్వామ్



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 26 (సింగిడి): రైతులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో గాంధారి మండలంలో రైతులు గళమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వ్యవసాయ రంగానికి సంబంధించిన హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని వారు కోరారు.

హామీలు అమలు కావాలి.. రైతులకు భరోసా కల్పించాలి!

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా అందడంలో ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించకూడదని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. వ్యవసాయ పెట్టుబడుల భారం, సాగునీటి అవసరాలు, పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.

వరంగల్ డిక్లరేషన్‌లోని 20 హామీలు అమలు చేయాలి

వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన 20 అంశాలను అమలు చేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రైతు భరోసా అందించడంతోపాటు పూర్తిస్థాయి రుణమాఫీ చేపట్టాలని, కౌలు రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందించాలని, ప్రతి పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలనే హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూతపడిన చక్కెర కర్మాగారాలను తిరిగి తెరవడం ద్వారా రైతులకు మేలు చేయాలని కోరారు. పోడు భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి అర్హులైన రైతులకు తగిన హక్కులు కల్పించి, వారి సాగుకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పంటలకు రక్షణ.. సాగుకు సౌకర్యాలు కల్పించాలి

అటవీ జంతువుల వల్ల పంటలకు జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేని రైతుల సమస్యలను పరిష్కరించి, వ్యవసాయ పనులకు అనువుగా రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి, నష్టపోయే రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక సహాయక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి, ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి అంశంపై కార్యాచరణ ప్రకటించాలని సూచించారు. రైతుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగం బలోపేతం కావాలంటే రైతులకు ఆర్థిక భద్రత, నాణ్యమైన విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలైతేనే రైతులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం మండల అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి భూపతి, జిల్లా కమిటీ సభ్యులు శంకర్‌రావు, రావు సాహెబ్‌రావు, మండల కమిటీ సభ్యులు నర్సింలు, వసంతరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు హాజరై తమ సమస్యలను తెలియజేస్తూ, వరంగల్ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే 'ఈసీ' పనిచేస్తోంది

బీఆర్ఎస్ కట్టిన బ్యారేజీలన్నీ లీకేజీలే:

ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 26 (సింగిడి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప

రామగిరి ఖిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



- ట్రెక్కింగ్ చేసిన వారికి వన్ ప్లస్ ఫోన్ గిఫ్ట్
- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 26 (సింగిడి): చారిత్రక రామగిరి ఖిల్లాకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. సోమవారం రామగిరి ప్రాంతంలో సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి, ఖిల్లా పూర్తి ప్రాంతాన్ని సందర్శించారు. రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాలు, ప్రకృతి అందాలను స్వయంగా పరిశీలించారు.

రామగిరి ఖిల్లాకు రోప్‌వే..

రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి కీలకమైన రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రోప్‌వే అందుబాటులోకి వస్తే పర్యాటకులు ఖిల్లాను సందర్శించడం మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం చారిత్రక ఖిల్లాను సులభంగా సందర్శించే అవకాశం కలుగుతుంది. దీంతో మంథని ప్రాంతానికి పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది అని అన్నారు.

యువతకు సవాల్.. విజేతకు వన్‌ప్లస్ ఫోన్ గిఫ్ట్!

యువతలో సాహస క్రీడలు, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో వన్ ప్లస్ ఫోన్ సవాల్‌ను ముందుకు తీసుకువచ్చానని ఈ సవాల్‌లో విజేతగా నిలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్‌ను బహుమతిగా అందించనున్నట్లు ఎంపీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వంశీ వెంట నాయకులు బండారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం అభినందనీయం

223 మంది స్వచ్ఛంద రక్తదానం.. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26 సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం భువనగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 223 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల రక్షణ, దేశ భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు పోలీసు సిబ్బంది, యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, రక్తదానం ద్వారానే అత్యవసర పరిస్థితుల్లో రోగులకు, ప్రమాద బాధితులకు అవసరమైన రక్తాన్ని అందించగలమని తెలిపారు. యువత రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది ఒకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, మానవతా విలువలను చాటిచెప్పే గొప్ప సేవ అని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ శ్రీ సద్ది వెంకటరెడ్డి మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం వారి త్యాగాలకు అర్థవంతమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని, అమరవీరుల కుటుంబాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది, ఇతర ప్రతినిధులు ఒక నిమిషం మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ విద్యానగర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మీనారాయణ, ఆర్మ్డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ శ్రీ వినోద్ కుమార్, యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, భువనగిరి డీఎస్పీ రవీందర్, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ డీఎస్పీ సురేష్, జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ శ్రీ దిడ్డి బాలాజీ, జిల్లా ట్రెజరర్ ఎం.ఏ. రహీం, జిల్లా డైరెక్టర్లు జె. అంజయ్య, యి. రాంరెడ్డి, కే. ప్రభాకర్ రెడ్డి, ఈ. లావణ్య, కే. చంద్రశేఖర్, డాక్టర్ ఏ. అనిల్ కుమార్, ఎం. వెంకటేశ్వర్ రెడ్డి, ఈ. రామచంద్రారెడ్డి, ఎన్.ఎన్. చారి, ప్రతినిధులు ఎస్పీ ఉపేందర్, స్పందన, వై. పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసిన ఎస్పీ అక్షాన్ష్‌యాదవ్

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



ఉమ్మడి నల్లగొండ బ్యూరో , అక్టోబర్ 26 (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ) పుస్తకం, వివిధ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించడంతో పాటు, అనుమానిత వ్యక్తుల షీట్లు, రౌడీ షీట్లను తనిఖీ చేశారు. నేర నియంత్రణకు సంబంధించి పోలీసుల నిఘాను మరింత పటిష్టం చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, పోలీస్ స్టేషన్ పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతను పాటిస్తూ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

విద్యకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



కరీంనగర్, అక్టోబర్26(సింగిడి): వాల్మీకి మహర్షి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అందులోని నీతి, ధర్మం, సత్యం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, వివిధ శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

నీళ్లు ఇవ్వక.. కొనుగోలు చేయక రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు



సిద్దిపేట ప్రతినిధి అక్టోబర్ 26, (సింగిడి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్ర సోమిరెడ్డి, రాగుల సారయ్య, కాముని శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పిఎసిఎస్ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, నల్ల నరేందర్ రెడ్డి, ములకల కనకరాజు, నాయకులు రవీందర్ రెడ్డి , ప్రభాకర్ వర్మలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల వద్ద ప్రభుత్వం ధాన్యం సేకరించకపోవడంతో రైతుల ధాన్యం దళారుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పూర్తిగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. గత రెండు మూడు రోజుల వరకు రూ. 2400 క్వింటాలు చొప్పున ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రూ. 1800 కింటాలు చొప్పున ధాన్యాన్ని అన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం రైతులకు సాగునీరు ఇవ్వకపోవడంతో పంటలు సరిగా పంటలేదని, ఇచ్చిన పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందంటే దానిని కొనుగోలు చేయడం లేదన్నారు. రైతు భరోసా ఇవ్వలేదు, రైతు బీమా పథకాన్ని ఎగవేసింది.. రుణమాఫీ సరిగా చేయలేదన్నారు. కరెంటు సరఫరా సరిగా లేదు.. ట్రాన్స్ఫార్మర్ కాలిపోతే దాని అమర్చి దిక్కు లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసర పాపయ్య బెదురు తిరుపతి, కాముని ఉమేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి భూసేకరణలో నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టర్‌కు తెనుగుపల్లి రైతుల వినతి



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్26 (సింగిడి): సింగరేణి భూసేకరణలో నష్టపోతున్నామంటూ మంథని నియోజకవర్గం రామగిరి మండలం తెనుగుపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. =+-3 ఏరియాఖ్యూ-2 విస్తరణ కోసం సింగరేణి చేపడుతున్న భూసేకరణలో తమకు న్యాయం చేయాలని గ్రామ రైతులు నిర్వాసితులు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 2010 నుండి సాగుతున్న భూసేకరణ ప్రక్రియలో సర్వే లోపాలు జరిగాయని, హైకోర్టు ఆదేశాలను పాటించకుండా నోటిఫికేషన్లు ఇస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామంలో ఉన్న దాదాపు 450 ఇళ్లకు గాను కేవలం 34 ఇళ్లతోనే ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వడం, 195 ఇళ్లకు పరిహారం కుదరదని చెప్పడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుపేద కుటుంబాలకు చెందిన వారమని, గతంలో అక్కపెల్లి గ్రామంలో కూడా భూములు త్యాగం చేసి రెండోసారి నిర్వాసితులు అవుతున్నామని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం సెక్షన్-39 ప్రకారం అదనపు పరిహారం, ప్రభుత్వం జూన్ 2026లో సవరించిన కొత్త మార్కెట్ విలువల ప్రకారం పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు నిర్వాసితులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా రజకుల ఐక్యతకోసం కృషి..

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి..

మద్దూరు మండల అధ్యక్షుడిగా పిడిచెట్టి గౌరీష నియామకం



సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 26, (సింగిడి): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం కేంద్రంలో సోమవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు అధ్యక్షతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కసార్ల యాదగిరి (లడ్నూర్), ఆలేటి విష్ణు (మర్మమాల) లను ఎన్నికయ్యారు. రాష్ట్ర 4వ మహాసభ ఏర్పాటు సందర్భంగా మండల కమిటీ ఏర్పాటు లో భాగంగా మద్దూరు మండలం అధ్యక్షుడిగా పిడిశెట్టి గౌరీషా (మద్దూరు), గౌరవ అధ్యక్షులు కసార్ల బాల్ నర్సయ్య (లడ్నూర్), ఉపాధ్యక్షులు వధ్యాసం శ్రీకాంత్ (రేబర్తి), కాసర్ల రవీందర్ (లడ్నూర్), ప్రధాన కార్యదర్శి వధ్యాస్యం మహేష్ (రేబర్తి), వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ (నర్సాయిపల్లి), కోశాధికారి నాయన మహేష్, సహాయక కార్యదర్శులు బస్వరాజు స్వామి, కన్వీనర్లు ఆలేటి రాజయ్య, మేడిశెల్మి నవీన్, నియమించడం జరిగిందని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దిటి రాజు తెలిపారు.. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ మాట్లాడుతూ.. ముందుగా నూతన మండల కమిటీ కి శుభాకాంక్షలు తెలుపుతూ.. దశాబ్దాలుగా సమాజం కోసం సేవ చేస్తున్న రజకుల జీవితాలు మారడం లేదని అన్నారు. సిద్దిపేటలో జరిగే తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి 4వ మహాసభ ద్వారా రజకులను ఏకం చేయాలని దీని కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు..నవంబర్ లో జరిగే 4వ మహాసభ ద్వారా పాలకులకు రజకుల సత్తా చాటి చెప్పాలని ఆయన అన్నారు, మండలం నుంచి అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు శ్రీనాథ్, మరియు నాయకులు యూత్ నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఆలయ భద్రతపై సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్‌యాదవ్

భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత..

సీసీ కెమెరాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ



ఉమ్మడి నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 26 (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతపై ఆలయ ఈఓ, ఎస్పీఎఫ్ అధికారులతో కలిసి ఈఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల భద్రత, నేరాల నివారణ, భద్రతా ఏర్పాట్ల పటిష్టతపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ యాదగిరిగుట్టలోని కల్యాణకట్ట, పుష్కరిణి (గుండం) ప్రాంతాలను సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అన్ని కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర నిఘా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ, భద్రతా తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, ఎస్పీఎఫ్, ఆలయ అధికారుల మధ్య సమన్వయంతో పనిచేయాలని, నేరాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవానీ శంకర్, యాదాద్రి డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరి రావు, సీఐ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- కరీంనగర్‌లో బీజేపీ నిరసన
- కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత దూషణలు మానుకోవాలి
- జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



కరీంనగర్, అక్టోబర్26(సింగిడి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను పెంచుతున్న ప్రధానిపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రధానితో పాటు ఆయన తండ్రిని కించపరిచే వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు విధానాలకే పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలకు, కుటుంబ సభ్యులను అవమానించే వ్యాఖ్యలకు తావివ్వరాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇటువంటి వ్యాఖ్యలను విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా మరింత ఉద్ధృతంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట్‌రెడ్డి, గుజ్జ శ్రీనివాసరావు, కనుమల్ల గణపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్‌రావు, సీహెచ్ నరసింహారాజు, కచ్చాకాయల రాజేంద్ర ప్రసాద్, దురిశెట్టి సంపత్, గాజుల సప్నతో పాటు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.ల

ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద అస్తవ్యస్తంగా ట్రాఫిక్

ట్రాఫిక్ సిబ్బంది లేక వాహనదారులు, పాదచారుల ఇబ్బందులు



కరీంనగర్, అక్టోబర్ 26(సింగిడి): నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ కొరవడటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం సాయంత్రం ట్రాఫిక్ కానిస్టేబుల్ విధుల్లో లేకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ప్రాంతంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హత్య, అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదీ శిక్షతోపాటు జరిమానా

నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు సంచలన తీర్పు

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో , అక్టోబర్ 26 (సింగిడి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన హత్య, అత్యాచారం కేసులో వలిగొండ మండలం గొల్లేపల్లి గ్రామానికి చెందిన నిందితుడు చిన్నపాక రవితేజ కు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు సోమవారం నాడు సంచలన తీర్పు వెల్లడించింది. న్యాయస్థానం నిందితుడికి ఐపీసీ సెక్షన్ 302 కింద జీవిత ఖైదీ శిక్ష తోపాటు రూ. 5,000 జరిమానా, సెక్షన్ 376-+ కింద 7 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 1,000 జరిమానా, సెక్షన్లు 201 మరియు 379 ఐపీసీ కింద ఒక్కొక్క సెక్షన్‌కు 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ. 1,000 చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి రిటైర్డ్ ఏసిపి భుజంగరావు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ, కోర్టు డ్యూటీ అధికారి పిసి-4118 ఏ. రాము, సమన్ల అమలులో సహకరించిన పిసి 9667 మహేశ్ లు ప్రాసిక్యూషన్ తరఫున హాజరయ్యారు. కేసు పురోగతిలో సహకరించి నేరస్థునికి శిక్ష పడేలా చేసిన అందరిని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అభినందించారు.

నగరపాలక సంస్థ ప్రజావాణికి 18 దరఖాస్తులు

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్, అక్టోబర్26(సింగిడి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 18 దరఖాస్తులు అందాయి. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 6, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 3 దరఖాస్తులు వచ్చాయి. అనుమతులు లేని నిర్మాణాలు, వన్నుల సవరణ, ఆస్తుల పేరు మార్పిడి, నగర అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత విభాగాల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులనూ పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆయాజ్, ఉప కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, సహాయ కమిషనర్ రాజమనోహర్, కార్యనిర్వాహక ఇంజినీర్ లచ్చిరెడ్డి, డీసీపీ బషీరొద్దీన్, ఏసీపీలు శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆశయాలు స్ఫూర్తిదాయకం

సిద్దిపేట ప్రతినిధి అక్టోబర్ 26 (సింగిడి): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పార్టీ శ్రేణులతో కలిసి వాల్మీకి ఫోటోకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాల్మీకి మహర్షి సమాజానికి ధర్మం,సత్యం, నీతి,మానవత్వం వంటి గొప్ప విలువలను చాటి చెప్పారని కొనియాడారు.

అతివ
Athiva
మంగళవారం
27-10-2026





ఉదయాన్నే గిన్నెడు తింటే ఏనుగులాంటి బలం..!

మనం ఆరోగ్యంగా, చురుకుగా ఉండాలంటే సరైన పోషకాలున్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అలాంటి పోషకాల గని పెసలు. వారంలో కనీసం రెండు లేదా మూడు రోజుల పాటు పెసలను మీ ఆహారంలో చేర్చుకోవడం వలన అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పెసలలో ప్రోటీన్లు, విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి వంటి విటమిన్లతో పాటు పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, కాపర్, ఫోలేట్, డైటరీ ఫైబర్ వంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి.. పెసలతో తయారు చేసిన ఆహారం రోజంతా ఎనర్జిటిక్ గా ఉంచడంలో సహాయపడుతుంది.

బరువు తగ్గింపులో కీలక పాత్ర:

పెసలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ లక్షణం బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక గొప్ప ఆహారం. పెసలు శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించి, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. పెసలు తీసుకోవడం వలన కడుపు నిండిన భావన ఎక్కువ సేపు ఉంటుంది. ఇది తరచుగా ఆకలి వేయకుండా నిరోధించి, అధికంగా తినడాన్ని తగ్గిస్తుంది. రాత్రి సమయంలో పెసలు తీసుకోవడం బరువు తగ్గింపు ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేస్తుంది. వీటిని మొలకలు రప్పించి, ఉడికించి లేదా పిండి రూపంలో అట్టుగా వేసుకుని ఎలా తీసుకున్నా ప్రయోజనాలు పొందవచ్చు.

రక్తపోటు నియంత్రణ – చురుకుదనం:

పెసలు రక్తపోటు స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి సహాయపడతాయి. ఇందులో ఉండే కొన్ని పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. పెసలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీరంలో శక్తి స్థాయిలు పెరిగి, రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది.

ఐరన్ లోపం దూరం:

ఐరన్ లోపంతో బాధపడే వారికి పెసలు ఒక వరం అని చెప్పవచ్చు. వీటిలో ఐరన్ సమృద్ధిగా ఉండటం వలన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఐరన్ లోపం నుండి బయటపడవచ్చు. ముఖ్యంగా శాఖాహారులలో ఐరన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. అలాంటి వారికి పెసలు చాలా మంచి ఆహారం.

చర్మ – జుట్టు ఆరోగ్యం:

పెసలలో విటమిన్ బి, విటమిన్ సి, మాంగనీస్, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సూర్యుని నుండి వచ్చే అతినీల లోహిత కిరణాలు, పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే సమస్యలను తగ్గించడానికి పెసలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే, పెసలలో ఉండే ప్రోటీన్లు, పోషకాలు జుట్టు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

జీర్ణక్రియ – మధుమేహం నియంత్రణ:

పెసలలో డైటరీ ఫైబర్ సమృద్ధిగా ఉండటం వలన జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తకుండా చేస్తుంది. ఇది జీర్ణ ప్రక్రియను సాఫీగా జరిగేలా చేస్తుంది. డయాబెటిస్ ఉన్న వారికి కూడా పెసలు చాలా మంచి ఆహారం. నానబెట్టిన పెసలను ప్రతిరోజూ ఒక స్పూన్ మోతాదులో తీసుకోవడం వలన రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

రోగనిరోధక శక్తి – ఇతర ప్రయోజనాలు:

పెసలు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇది సీజన్ మారినప్పుడు వచ్చే అనారోగ్య సమస్యలను నివారిస్తుంది. హార్మోన్ల అసమతుల్యతను నివారించి, కండరాల నొప్పులు, తలనొప్పి, నీరసం వంటి వాటిని తగ్గిస్తుంది. అంతేకాకుండా, కంటి చూపు మెరుగుదలకు కూడా పెసలు సహాయపడతాయి. కాబట్టి, పెసలను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. అయితే.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

అటుకులు అని లైట్ తీసుకుంటున్నారా..?

బరువు తగ్గించడంతో పాటు గుండెను పదిలంగా ఉంచే అద్భుత ఔషధం!



శ్రీకృష్ణుడికి కుచేలుడు ఇచ్చిన కానుకగా భావించే అటుకులు కేవలం రుచికరమైన అల్పాహారమే కాకుండా, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న సంపూర్ణ ఆహారం.

ఇందులో క్యాలరీలు, కొవ్వు శాతం చాలా తక్కువగా, పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమ ఎంపిక. కూరగాయలు, వేరుశనగలు కలిపి చేసుకునే ఈ అల్పాహారం గుండెను పదిలంగా ఉంచడంతో పాటు రోజంతా తక్షణ శక్తిని అందిస్తుంది.

రక్తహీనత నివారణ, మధుమేహ బాధితులకు మేలు: అటుకులను తయారు చేసే ప్రక్రియలో ఇవి సహజంగానే ఐరన్ కంటెంట్‌ను పొందుతాయి. కూరగాయలు, వేరుశనగలు, నిమ్మరసంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి ఐరన్, ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయి. రక్తహీనతతో బాధపడేవారికి, గర్భిణీలకు, చిన్న పిల్లలకు ఇది ఎంతగానో మేలు చేస్తుంది. అంతేకాకుండా, అటుకులు రక్తంలోని చక్కెర స్థాయిలను అకస్మాత్తుగా పెంచవు. కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా వైద్యుల సూచన మేరకు పరిమితంగా వీటిని తీసుకోవచ్చు.

గుండెకు రక్షణ, గ్లూటెన్ రహిత ఆహారం: అటుకుల్లో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. ఇందులో లాక్టోస్, ఫ్యాట్, గ్లూటెన్ ఉండవు. గోధుమలతో తయారైన ఆహారం పడని వారు అటుకులను హ్యాపీగా తినొచ్చు. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రోజం తా ఉత్సాహంగా ఉండేలా ఇన్‌స్టంట్‌గా ఎనర్జీని అందిస్తాయి. బియ్యంతో తయారైనప్పటికీ, అన్నం తిన్నంత తృప్తిని ఇస్తాయి.

రుచికరంగా మార్చుకునే చిట్కాలు: అటుకులను క్యారెట్, బఠానీలు, క్యాప్సికమ్ వంటి కూరగాయలతో పండుకుంటే ఇది విటమిన్ల గనిగా మారుతుంది. అయితే అటుకులను ఎక్కువ సేపు నీళ్లలో నానబెట్టకుండా, కేవలం కడిగి వెంటనే వడకడితే అవి పొడిపొడిగా వస్తాయి. చివరగా కొద్దిగా నిమ్మరసం పిండటం వల్ల అందులోని ఐరన్‌ను శరీరం వేగంగా గ్రహిస్తుంది. కాబట్టి రోజూవారీ డైట్‌లో అటుకులను భాగం చేసుకుని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోండి.

బరువు నియంత్రణ, తేలికైన జీర్ణక్రియ: అటుకులలో క్యాలరీలు చాలా తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉదయాన్నే అటుకులు తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఆకలి వేయదు. ఇది అనవసరమైన స్నాక్స్ తినకుండా నిరోధించి బరువు తగ్గడానికి బాగా సహాయపడుతుంది. ఇతర అల్పాహారాలతో పోలిస్తే ఇవి చాలా తేలికగా అరిగిపోతాయి. గ్యాస్, కడుపు ఉబ్బరం లేదా అనారోగ్యంతో బాధపడేవారు కూడా వీటిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

కూతురి భవిష్యత్తుకు భరోసా..

నెలకు రూ.5,000 పొదుపు .. 21 ఏళ్లకు ఎంత మొత్తం వస్తుందో తెలుసా?

ఇది ప్రభుత్వ హామీని అందిస్తుంది. అంటే మీ డబ్బు సురక్షితంగా ఉంటుంది. అంతేకాకుండా ఇది ప్రస్తుతం సంవత్సరానికి 8.2% అత్యధిక వడ్డీ రేటు ను అందించే చిన్న పొదుపు పథకాలలో ఒకటి. మీరు ప్రతి నెలా రూ. 5,000 డిపాజిట్ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో ఎంత డబ్బు పొందవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.



ఖాతా తెరవడానికి నియమాలు ఏమిటి?: కుమార్తెకు 10 సంవత్సరాల వయస్సు రాకముందే సుకన్య సమృద్ధి యోజన కింద ఖాతాను తెరవవచ్చు. తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకులు ఈ ఖాతాను తెరవవచ్చు. ప్రతి ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ. 250 నుండి గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు డిపాజిట్లు చేయవచ్చు. సాధారణ నియమం ప్రకారం, ఒక కుటుంబంలో ఇద్దరు కుమార్తెల పేర్ల మీద ఖాతాలు తెరవవచ్చు. కవలలు లేదా ముగ్గురు పిల్లలు పుట్టడం వంటి కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మినహాయింపులు అందుబాటులో ఉంటాయి.

కుమార్తెకు 18 ఏళ్లు నిండే వరకు సంరక్షకుడు ఖాతాను నిర్వహిస్తారు. ఆ తర్వాత అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా కుమార్తె స్వయంగా ఖాతాను నిర్వహించుకోవచ్చు. కుమార్తెకు 18 ఏళ్లు నిండిన తర్వాత లేదా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఉన్నత విద్యా ఖర్చుల కోసం ఖాతా నుండి నిధులను ఉపసంహరించుకోవచ్చు. దీనికి సంబంధించిన పత్రాలు అవసరం. పథకం నియమాలు, షరతులకు లోబడి, కొన్ని పరిస్థితులలో ఖాతాను గడువుకు ముందే మూసివేయడం సాధ్యమవుతుంది.

ప్రతి నెలా రూ. 5,000 జమ చేస్తే పెట్టుబడి ఎంత అవుతుంది?: సుకన్య సమృద్ధి యోజన ప్రస్తుతం సంవత్సరానికి 8.2% వడ్డీ రేటును అందిస్తోంది. మీరు ప్రతి నెలా రూ. 5,000 జమ చేస్తే, సంవత్సర కాలంలో మొత్తం రూ. 60,000 జమ చేస్తారు. ఈ విధంగా 15 సంవత్సరాలు డిపాజిట్ చేసిన తర్వాత మీ మొత్తం పెట్టుబడి రూ. 9 లక్షలకు చేరుకుంటుంది. దీని తర్వాత, మీరు కొత్తగా ఎలాంటి డిపాజిట్లు చేయవలసిన అవసరం ఉండదు. కానీ మెచ్యూరిటీ వరకు డిపాజిట్‌పై వడ్డీని పొందుతూనే ఉంటారు.

21 సంవత్సరాల తర్వాత నాకు ఎంత డబ్బు వస్తుంది?: సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచిన తేదీ నుండి 21 సంవత్సరాలకు పరిపక్వం చెందుతుంది. 15 సంవత్సరాల పాటు డిపాజిట్లు చేయవలసి ఉంటుంది. దీని తర్వాత తదుపరి ఆరు సంవత్సరాల పాటు బ్యాలెన్స్‌పై వడ్డీ జమ అవుతూనే ఉంటుంది. పెట్టుబడి కాలమంతా వడ్డీ రేటు సంవత్సరానికి 8.2% వద్ద స్థిరంగా ఉంటే, నెలకు రూ. 5,000 డిపాజిట్ చేయడం ద్వారా 21 సంవత్సరాల తర్వాత సుమారుగా రూ. 27.5 లక్షల కార్పస్ సమకూరవచ్చు. మీ మొత్తం పెట్టుబడి రూ. 9 లక్షలు అవుతుంది. మిగిలిన సుమారు రూ. 18.5 లక్షలు వడ్డీ నుండి వస్తాయి.



స్టాక్ మార్కెట్ Stock Market

టెస్లా దూకుడు..

భారత్‌లో ఎలాన్ మస్క్‌కు ఎంత ఆదాయమో తెలుసా?

ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ సంస్థ భారత విభాగం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 247.31 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. అదే సమయంలో రూ. 5.16 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. భారత్‌లో కార్ల విక్రయాలు ప్రారంభించిన తొలి పూర్తి ఆర్థిక సంవత్సరంలోనే సంస్థ ఈ ఫలితాలను సాధించడం గమనార్హం.

ఏడాదిలోనే 12 రెట్లు పెరిగిన ఆదాయం!

టెస్లా ఇండియా కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 20.83 కోట్లుగా ఉంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇది ఏకంగా రూ. 247.31 కోట్లకు చేరింది. అంటే దాదాపు 12 రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం ప్రధానంగా సేవల ద్వారా వచ్చింది. అయితే 2025-26లో కార్ల విక్రయాలు ప్రారంభం కావడంతో ఆదాయం గణనీయంగా పెరిగింది. సంస్థ నికర లాభం కూడా అంతకుముందు ఏడాదిలో నమోదైన రూ. 55.49 లక్షల నుంచి రూ. 5.16 కోట్లకు పెరిగింది.

ఆదాయంలో సింహభాగం కార్ల అమ్మకాలదే:

టెస్లా భారత్‌లో సాధించిన మొత్తం ఆదాయంలో కార్ల విక్రయాలు కీలక పాత్ర పోషించాయి.
మొత్తం ఆదాయం: రూ. 247.31 కోట్లు
కార్ల విక్రయాల ద్వారా: రూ. 214.69 కోట్లు
సర్వీసుల ద్వారా: రూ. 32.40 కోట్లు
నికర లాభం: రూ. 5.16 కోట్లు
మొత్తం ఆదాయంలో దాదాపు 87 శాతం కార్ల విక్రయాల ద్వారానే వచ్చింది. భారత్‌లో టెస్లా తన వ్యాపారాన్ని విస్తరించుకుంటున్న నేపథ్యంలో ఈ గణాంకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

భారత్‌లో ఎప్పుడు ప్రారంభమైంది?

టెస్లా 2025 జూలైలో ముంబైలో తన తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. అనంతరం భారత మార్కెట్‌లో తన ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలను ప్రారంభించింది. కంపెనీకి భారత్‌లో ఇది కీలకమైన అడుగు.వాహనాల రిజిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం, 2025 సెప్టెంబర్ నుంచి 2026 మార్చి వరకు టెస్లా 346 వాహనాలను నమోదు చేసింది. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఈ సంఖ్య 650కు చేరింది. అంటే ఆరు నెలల్లోనే అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన సంఖ్యను అధిగమించింది. అయితే భారత కార్ల మార్కెట్‌తో పోలిస్తే కంపెనీ విక్రయాల పరిమాణం ఇంకా తక్కువగానే ఉంది.

వ్యాపార విస్తరణకు రూ. 86 కోట్ల పెట్టుబడి

భారత్‌లో కార్యకలాపాలను విస్తరించేందుకు టెస్లా తన భారత విభాగంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 86 కోట్ల అదనపు మూలధనాన్ని పెట్టుబడిగా పెట్టింది. అదే సమయంలో ఉద్యోగుల వ్యయాలు, కార్యాలయాల అద్దెలు, మౌలిక సదుపాయాల ఖర్చులు కూడా పెరిగాయి. కంపెనీ మొత్తం ఖర్చులు సుమారు రూ. 240 కోట్లకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ. 247 కోట్ల ఆదాయంపై రూ. 5.16 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

భారత్‌లో టెస్లా భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?

భారత మార్కెట్‌లో టెస్లా ఆదాయం పెరగడం, నికర లాభాన్ని నమోదు చేయడం కంపెనీకి సానుకూల పరిణామాలు. అయితే ఒక్క ఏడాది లాభాల ఆధారంగా భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో లాభాలు కొనసాగుతాయని చెప్పలేం.

భారత్‌లో ఎలక్ట్రిక్ కార్లకు పెరుగుతున్న ఆదరణ, కార్ల ధరలు, పోటీ సంస్థల వ్యూహాలు, వినియోగదారుల కొనుగోలు సామర్థ్యం వంటి అంశాలు టెస్లా భవిష్యత్తు వ్యాపారంపై ప్రభావం చూపనున్నాయి. ప్రస్తుత గణాంకాలు మాత్రం భారత్‌లో టెస్లా వ్యాపారం ప్రారంభ దశను దాటి విస్తరణ దిశగా అడుగులు వేస్తోందని సూచిస్తున్నాయి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. రూ. 247.31 కోట్లు అనేది కంపెనీ ఆదాయం. రూ. 5.16 కోట్లు దాని నికర లాభం. ఈ రెండింటినీ ఒకటిగా భావించకూడదు.



నిరుపేద కుటుంబానికి అండగా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి (సింగిడి): పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయ సహకారాలు అందించడంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ముందుంటున్నారు. ఇందులో భాగంగా వెల్దండ మండల పరిధి లోని రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు మంజుల ఇంటి నిర్మాణం కోసం ఆదివారం 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్న మంజులకు తనవంతుగా సహాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా భవిష్యత్తులోనూ తనకు సాధ్యమైనంత మేరకు సహాయ సహకారాలు అందిస్తానని గోలి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తోడ్పాటు అందించడం ద్వారా వారికి కొంత ఊరట కల్పించవచ్చని, సమాజంలో సేవాభావం ప్రతి ఒక్కరిలో ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు బుచ్చిబాబు, గూళ్ల వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్ సహకారంతో జర్మనీ టెక్నాలజీతో
తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత



కల్వకుర్తి ,(సింగిడి): ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీటిని అందించి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం కల్వకుర్తి నియో జకవర్గంలో కొనసాగుతోంది. కార్యక్రమం లో భాగంగా ఆదివారం కల్వకుర్తి మండలంలోని జిల్లేల్ల గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో మూడవ విడతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో త్రాగునీటి ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రపరిచారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన త్రాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లోని త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశు భ్రంగా ఉంచడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, కలుషిత నీటి వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను నివారించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజారో గ్యానికి ప్రాధాన్యమిస్తూ కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దశలవారీగా 'స్వచ్ఛ జలధార' కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లేల్ల గ్రామ సర్పంచ్ రాజేశ్వరి రవి గౌడ్, ఉపసర్పంచ్ రవి, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు ఇషబ్, వార్డు సభ్యులు మల్లేష్, శ్రీశైలం, నరేష్, జంగయ్య, రాజు, మహేందర్‌తో పాటు గ్రామ యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీతో
జానపద కళాకారుల సంక్షేమానికి భరోసా
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కవులు, కళాకారులు, రచయితల సమావేశం



బిజినపల్లి, (సింగిడి): తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కవులు, కళాకారులు, రచ యితల సమావేశం ఆదివారం బిజిన పల్లి మండల కేంద్రం లోని ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాకారుల సంక్షేమం, గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు, ప్రమాద బీమా, ఉపాధి అవకాశాలపై చర్చించారు. కళాకారులం దరూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. సంఘంలో శాశ్వత సభ్యత్వానికి రూ. 5,000, సాధారణ సభ్యత్వానికి రూ. 3,000గా నిర్ణయించినట్లు తెలిపారు. నవంబర్ 3న సిరిసిల్లలో జరిగే తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభలో కళాకారులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కోదాడ శీను గజ్వేల్ వేణు ఎద్దుల జంగిరెడ్డి, సంతోష్. జయప్రకాష్, పిట్టలదొర భాస్కర్, డప్పు స్వామి, రవిశంకర్, మీసాల రాములు. తదితరులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



మధిర, (సింగిడి):ఎర్రుపాలెం మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశం ఆదివారం జమలాపురం లోని బాలాజీ భవన్ లో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు యర మల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశంలో రెండు సంవత్సరాల కాల పరిమితితో నూతన కార్యవర్గాన్ని సభ్యులుఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను గంధం శ్రీనివాసరావు, అంగిరేకుల రామకృష్ణ, కాపర్తి సతీష్ పర్యవేక్షించారు. నూతన కార్యవర్గం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గౌరవ అధ్యక్షులు గాయరమల శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారులుగా, యన మండల విష్ణువర్ధన్ రావు ముఖ్య సలహాదారు లుగా, గంధం శ్రీనివాసరావు, అంగిరేకుల రామకృష్ణ, అధ్యక్షులుగా తోట సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా కోన రమేష్, కార్యదర్శిగా ఉయ్యూరు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా నాగిరెడ్డి రమేష్, ఉపాధ్యక్షులుగా కుక్కల మురళీకృష్ణ, పసుపులేటి మహేష్, కోశాధికారిగా కాపర్తి సతీష్, కార్యవర్గ సభ్యులు గా మారబత్తుల సుష్మ తేజ, వేమిరెడ్డి శివలింగారెడ్డి, ఆకుల రవి, బొబ్బిళ్ళపాటి క్రిస్టఫర్, రాజారపు శ్రీనివాసరావు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు, బాణాల శంకరాచారి, కే .సుధాకర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళల అభ్యున్నతికే ప్రాధాన్యం..
ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
మహిళ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన..
నాగుపల్లి డ్వాక్రా మహిళల కల సాకారం..



దమ్మపేట, (సింగిడి):మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. డ్వాక్రా మహిళల సమావేశాలు, ఇతర ముఖ్య కార్యకలాపాల నిర్వహణ కోసం నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వైభవంగా భూమి పూజా పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. మహిళల సామాజిక, ఆర్థిక సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. డ్వాక్రా మహిళలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ఈ కమ్యూనిటీ భవనం మహిళా సంఘాల బలోపేతానికి, వారి అంతర్గత సమావేశాలకు వేదికగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీసీసీ సభ్యులు మద్దిశెట్టి సత్యప్రసాద్, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కుంపటి వేణు, ముఖ్య నాయకులు మారగాని నాగేశ్వరరావు, వార్డు మెంబర్ కాసిన కుమారి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రజావాణి
ప్రజల నుంచి వినతుల స్వీకరణకు అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు
మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి
ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి

మహబూబ్ నగర్ బ్యూరో (సింగిడి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమం రేపు (సోమవారం, అక్టోబర్ 26న) మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతుల స్వీకరణ

ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిం చబడుతుంది. జిల్లా స్థాయి కలెక్టరేట్‌లో, డివిజన్ స్థాయిలో సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయాల్లో, మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయాల్లో సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు-భవనాలు, సాగునీరు, భూగర్భ జల శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి నిర్వహణకు సమన్వయంతో ఏర్పాట్లుఒకటి కంటే ఎక్కువ మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు తమ పరిధిలోని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల వినతుల స్వీకరణకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని మండలాల్లో ప్రజలకు సౌకర్యవంతంగా వినతులు సమర్పించే అవకాశం కల్పించి, కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను జిల్లా, డివిజన్ లేదా మండల స్థాయిలో తమకు సమీపంలోని సంబంధిత కార్యాలయంలో సమర్పించి ప్రజావాణి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు.

మన్ కీ బాత్ ప్రజలకు ప్రధానమంత్రికి మధ్య
ఒక ఆత్మీయ వారధిగా నిలిచింది
అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): మన్ కీ బాత్ ప్రజలకు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మధ్య ఒక ఆత్మీయ వారధిగా నిలిచిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ 139వ ఎపిసోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలకు కృషి, సేవా స్ఫూర్తి, ఆవిష్కరణలు,దేశీయ ప్రతిభను దేశవ్యాప్తంగా పరిచయం చేయడం కార్యక్రమ ప్రత్యేకత అని తెలిపారు. ఈ ఎపిసోడ్ లో పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తున్న నవ్-త్రింజన్ కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసించడం విశేషమని పేర్కొ న్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడంతో పాటు, చేనేత నైపుణ్యాల ను భావితరాలకు అందించడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశా లు ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిసు న్నాయని వివరించారు. అలాగే ఉత్తరాఖండ్ లోని హేవల్ నదిని పునరుజ్జీవింపజేయడానికి



స్థానిక ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, మొక్కల పెంపకం కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించడం పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తోం దన్నారు. రాబోయే దీపావళి పండుగ సందర్భంగా స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారు,చిన్న వ్యాపారులు తయారు చేసిన స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని ఇచ్చిన పిలుపు ప్రతి భారతీయుడు ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. మన్ కీ బాత్ కేవలం రేడియో కార్యక్రమం మాత్రమే కాదని, దేశంలోని మారు మూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను కోట్లాది మందికి పరిచయం చేసే గొప్ప వేదిక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎర్రం సుధీర్, నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాల బాటలో..
యువత భవిష్యత్తుకు మెండెం కిరణ్ బాటలు!
విశిష్ట సేవకు ప్రతిష్టాత్మక జనచేతన పురస్కారం..
13 ఏళ్ల విద్యా సేవకు దక్కిన గుర్తింపు..
6 వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా మార్గదర్శకత్వం
పట్టభద్రుల మద్దతు కూడగట్టడంలోనూ దూకుడు..
ఇప్పటికే 36 వేల మందికి పైగా సభ్యత్వాలు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, (సింగిడి): లక్ష్యం ఉన్నతమైనదైతే.. ప్రయా ణం సేవామయమైతే.. వయసుతో సంబంధం లేకుండా సమాజంలో ప్రత్యేక గుర్తింపు సాధిం చవచ్చని నిరూపిస్తున్నారు మెండెం కిరణ్ కుమార్. గ్రామీణ యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలను చేరువ చేస్తూ 13 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న సేవా ప్రస్థానానికి ప్రతిష్టాత్మకమైన జయశంకర్ జనచేతన పుర స్కారం లభించింది. ఈ అవార్డును అందుకున్న ఎమ్మెల్సీ కోదండరామ్, ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య లాంటి పది మంది ప్రముఖుల్లో అత్యంత పిన్న వయస్కు డిగా కిరణ్ కుమార్ నిలవడం విశేషం. తెలం గాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల స్ఫూర్తితో యువత అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆయనకు ఈ పుర స్కారం దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పురస్కారం వెనుక 13 ఏళ్ల అంకితభావం!

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేకపోయినా.. సరైన మార్గదర్శకత్వం, ఆర్థిక పరిస్థితులు, అవకాశాల లేమి అనేకమంది యువత లక్ష్యసాధనకు అడ్డంకు లుగా మారుతున్నాయి. ఈ పరిస్థితులను అధి గమించి యువత తమ కాళ్లపై తాము నిలబడా లనే సంకల్పంతో మెండెం కిరణ్ కుమార్ రైట్ చాయిస్ అకాడమీ (ఆర్‌సీఏ) ద్వారా విద్యా, ఉద్యోగ మార్గదర్శకత్వ సేవలను కొనసాగిస్తు న్నారు. గత 13 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న ఈ ప్రయాణంలో వేలాది మంది యువతకు మార్గ దర్శిగా నిలిచారు. 6,000 మందికి పైగా గ్రామీ ణ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధిం చగా.. లక్షన్నర మందికి పైగా యువత, పట్టభద్రులకు విద్యా, ఉద్యోగ అవకాశాలపై



మార్గనిర్దేశం అందింది. వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా.. ఇతరుల విజయానికి బాటలు వేయడమే నిజమైన సామాజిక సేవ అనే సందేశాన్ని ఆయన ప్రయాణం చాటుతోంది.

ప్రొ.జయశంకర్ ఆశయాల బాటలో..!

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వయం పాలన, ప్రాంతీయ అభివృద్ధి ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారు. ఆ ఆశయాల స్ఫూర్తితో యువతకు విద్య, ఉపాధి అవకాశాలు అందించేందుకు కృషి చేయడం ద్వారా మెండెం కిరణ్ కుమార్ తనదైన సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. ఆయన చేసిన విశిష్ట సేవలకు జయశంకర్ జనచేతన పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో వీసీకే పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీసీకే అవార్డుల కార్యక్రమంలో మెండెం కిరణ్ కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎమ్మెల్సీ కోదండరామ్, విప్లవ గాయని విమలక్క, వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు తిరుమావళవన్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్రోల్మెంట్ లో తనదైన ముద్ర!

విద్యా సేవలతో పాటు రాజకీయ రంగంలోనూ మెండెం కిరణ్ కుమార్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు సన్నద్ధమవు తున్న ఆయన.. ఇప్పటికే దాదాపు 36 వేల మందికి పైగా పట్టభద్రులను సభ్యులుగా చేర్చి నట్లు వెల్లడించారు. పట్టభద్రుల సమస్యలపై అవగాహన, యువతతో నిరంతర సంబంధా లు, విద్యా-ఉద్యోగ రంగాల్లో తనకున్న అనుభ వాన్ని బలంగా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సభ్యత్వాల నమోదు ద్వారా పట్టభద్రుల్లో తనకున్న పరిచయాలను, మద్దతు కూడగట్టే ప్రయత్నాలను చాటుతున్నారు. విద్యా సేవల ద్వారా యువతకు చేరువైన ఆయన.. ఇప్పుడు పట్టభద్రుల సమస్యలకు ప్రాతినిధ్యం వహించాలనే లక్ష్యంతో రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

యువత అభ్యున్నతే లక్ష్యం.. సేవే అసలైన గుర్తింపు!

ఒక అవార్డు వ్యక్తి సాధించిన విజయానికి గుర్తింపు కావచ్చు. కానీ ఆ విజయం వెనుక వేలాది మంది జీవితాల్లో వచ్చిన మార్పు ఉంటే దాని విలువ మరింత పెరుగుతుంది. మెండెం కిరణ్ కుమార్‌కు లభించిన ఈ పురస్కారం కూ డా ఇదే కోణంలో ప్రాధాన్యం సంతరించు కుంది. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల స్ఫూర్తి.. 13 ఏళ్ల విద్యా సేవల అనుభవం.. వేలాది మంది యువత విజయాలే ప్రేరణగా ముందుకు సాగుతున్న మెండెం కిరణ్ కుమార్‌కు లభించిన ఈ పురస్కారం ఆయన ప్రయాణంలో మరో మైలురాయి.

మరొమారు మానవత్వం చాటుకున్న డిసిసిబి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



మునుగోడు, (సింగిడి):మునుగోడు మండల పరిధిలోని, కచలా పురం గ్రామానికి చెందిన, గురిజ మహేష్ రోడ్డు ప్రమాదనికి గురై హాస్పటల్ లో చికిత్స పొందుతున్నారు. అట్టి విషయం తెలుసు కున్న ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబ సభ్యులనుఫోన్ లో పరామర్శించి తన వంతు సహాయంగా రూ 10,000/- ఆర్థిక సహాయం పంపించి మానవత్వం చాటుకున్నారు. అట్టి డబ్బులను మండల పార్టీ అధ్యక్షుడు భీమనపెల్లి సైదులు మరియు కచలాపురం సర్పంచ్ ఏర్పుల మోహన్ బాబు చెతుల మీదుగా అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ,కచలాపురం మాజీ ఉపసర్పంచ్ కంచరకుంట్ల రవీందర్ రెడ్డి, చీకటిమామిడి మాజీ ఉపసర్పంచ్ పొలాగోని ప్రకాష్, పందుగ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సహాయం తీసుకున్న కుటుంబ సభ్యులు కుంభం శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మద్దూరులో కలకలం
విద్యుత్ స్తంభానికి వేలాడుతూ వ్యక్తి అనుమానాస్పద మృతి



నారాయణపేట ప్రతినిధి, (సింగిడి): మద్దూరు మున్సిపా లిటీ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది పడి ఉండడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మద్దూరు మున్సి పాలిటీ పరిధిలోని రేణివట్ల రోడ్డు మార్గంలో ఉన్న దినేష్ రైస్ మిల్ సమీపంలో ఓ విద్యుత్ స్తంభానికి గుర్తుతెలి యని వ్యక్తి ఉరివేసుకుని చనిపో యి కనిపించాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మద్దూరు ఎస్ఐ విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి మొబైల్ ఫోన్ గానీ, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలు లభించలేదని పేర్కొన్నారు. ఈ మృతదేహానికి సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిసినా, లేదా మృతుడి కుటుంబ సభ్యులు బంధువుల వివరాలు తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజే యాలని ఎస్ఐ విజయ్ కుమార్ కోరారు. సమాచారం ఇవ్వడానికి సంప్రదించాల్సిన నంబర్లుమద్దూరు ఎస్ఐ 87126 70407, మద్దూరు పోలీస్ స్టేషన్ 87126 71026.

సేవా దృక్పథంతో మెలగాలి
అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ధన్పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కిసాన్ ఫ్యాషన్ మాల్ లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నారు. పేదలను ఆదుకొని అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువత వారాంతంలో హంగు ఆర్భాటాలకు పోకుండా తోచిన విధంగా సేవ చేయాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో పేరు ప్రతిష్టల తో పాటు నలుగురికి సాయం చేశామన్న తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ధన్ పాల్ ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సన్నవడ్లు తీసుకుని
దొడ్డుబియ్యం ఇచ్చిన మిల్లర్లపై కేసులు
నలుగురు మిల్లర్లను అరెస్టు చేసిన సిఐడి

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):నిజామాబాద్ జిల్లాలో తొలిసారి సిఐడి మిల్లర్ల పై దాడులు నిర్వహించింది. అదివారం తెల్లవారు జామున నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలలో మిల్లులు నిర్వహిస్తున్న నలు గురు మిల్లర్లను అరెస్ట్ చేశారు. ఇద్దరు మిల్లర్లు పరారీ అయినట్లు సిఐడి డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సిఐడి డిఎస్పీ, ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్ఐల టీంకు తోడుగా లోకల్ పోలిసుల అండతో దాడులు జరిగాయి. నిజామాబాద్ జిల్లాలో కోట్ల రూపాయల సిఎంఆర్ ఎగవేత వేసిన వారిలో ప్రముఖ మిల్లర్లపై నజర్ వేసింది. అందులో భాగంగా మాస్టర్ బిహెచ్ యుడిఐ ఆగ్రో ఫుడ్స్ ఇండస్ట్రీస్ కు చెందిన లాబిశెట్టి శ్రీకాంత్, పద్మవతి ఆగ్రో ఇండస్ట్రీస్‌కు చెందిన లాబిశెట్టి గంగాప్రసాద్, వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమానీ పోట్ల అంజయ్య, శ్రీవాణి ట్రెడింగ్ ఆగ్రో ఇండస్ట్రీస్ అదినేత బోందుగుల దేవేందర్ లను తెల్లవారు జామున వారి ఇండ్లలోనే అరెస్టు చేశారు. ఇద్దరు పరారీలో ఉన్నారని సిఐడి అధికారులు తెలిపారు. పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మిల్లర్లను ఉదయం వెళ అరెస్టు చేయడం మిల్లర్లలో అలజడి చెలరేగింది. దీంతో మిల్లర్లను అరె-స్ట్ చేసింది ఎవరో తెలియక స్థానిక పోలీస్ స్టేషన్ లకు పరుగులు తీశారు. కానీ సిఐడి అధికారులని తెలిసి షాక్ కు గురయ్యారు.

భారతీయ జనతా పార్టీ మధిర
మండల మోర్చాల అధ్యక్షుల నియామకం.



మధిర, (సింగిడి): భారతీయ జనతా పార్టీ మధిర మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ అనుబంధ విభాగాలు అయిన మహిళా మోర్చా, ఎస్సీ మోర్చా అధ్యక్షుల నియామకం ఆదివారం జరిగింది. బిజెపి మధిర మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి అధ్యక్షతన మధిర మండల పరిధిలోని నిదానపురం గ్రామంలో జరిగిన భారతీయ జనతా పార్టీ మధిర మండల సమావేశంలో బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నిదాన పురం గ్రామానికి చెందిన చల్లా శైలజా రెడ్డి నీ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులుగా సిరిపురం గ్రామానికి చెందిన కనకపుడి రమేష్ ను, నియమిస్తూ నియామక పత్రాలు అందించడం జరిగింది. భారతీయ జనతా పార్టీ అభివృద్ధిలో మోర్చాల యొక్కప్రాధాన్యత భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండా చంద్రశేఖర్ రె

‘ఓట్ బచావో–దేశ్ బచావో’ను విజయవంతం చేయాలి

హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వొడితల ప్రణవ్

జమ్మికుంట, (సింగిడి): ప్రజా స్వామ్య పరిరక్షణ, ఓటు హక్కురక్షణ లక్ష్యంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ‘ఓట్ బచావో--దేశ్ బచావో’ నిరసన కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని ఇందిరా (డీసీసీ) భవన్‌లో కార్యక్రమ ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు శరత్, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి శ్రీశైలం, జిల్లా కాంగ్రెస్



అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఓట్ల అక్రమా లపై రాహుల్ గాంధీ ఇప్పటికే వివరించారని, ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థా యిలో ప్రచారం నిర్వహించినట్లు తెలి పారు. ఓటు చోరీ ఆరోపణలపై నిరసనగా నిర్వ హించే కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు ఢిల్లీలో కాంగ్రెస్ భారీ ప్రదర్శన

నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో సభ, తెలంగాణ నుంచి 15 వేల మందిని తరలించే లక్ష్యం. డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్, (సింగిడి): ఓటు హక్కుపరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ ప్రదర్శ నకు తెలంగాణ నుంచి 15 వేల మందిని తరలించాలని కాం గ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 100 మంది పాల్గొనాలని పిలుపునిచ్చారు.కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు ఎస్. శరత్, పీసీసీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే



కూన శ్రీశైలం గౌడ్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఈ పోరాటం ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసమని పేర్కొంటూ, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలిరావాలని కోరారు.కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటమే ఈ ఉద్యమ లక్ష్యమన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అక్రమాలను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ పరిశీలకుడు ఎస్. శరత్ మాట్లాడుతూ, మహారాష్ట్ర, కర్ణాటకలోని మహదేవపురం తదితర ప్రాంతాల్లో ఓటర్ల నమోదు, తొలగింపులపై రాహుల్ గాంధీ ఆధారాలతో ప్రశ్నలు లేవనెత్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, వొడితెల ప్రణవ్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం

నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగించకూడదా?

నవంబర్ 3న కరీంనగర్‌లో బీజేపీ ర్యాలీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



కరీంనగర్, (సింగిడి):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ అనవసర వివాదం సృష్టిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం విమర్శిం చారు. ఆదివారం ఇల్లంతకుంట మండల బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పా హార సమావే శంలో పాల్గొన్న ఆయన, అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘మనసులో మాట’ కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఓటర్ల జాబితాలో పారదర్శకతను పెంచి, నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమన్నారు. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ గతంలోనూ పలుమార్లు జరిగిందని గుర్తుచేశారు.ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనించాలని, ఓటర్ల జాబితా సవరణను రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని పేర్కొన్నారు.కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నవంబర్ 3న కరీంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతతో పాటు బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ హాజరవుతారని వెల్లడించారు.

మానకొండూరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి.కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్



కరీంనగర్, (సింగిడి):ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మానకొండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన చైర్మన్‌గా రేవెల్లి రాజలింగం, ఉపాధ్యక్షుడిగా రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్ షాబుద్దీన్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రావణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వాహన బీమా కేంద్రం ప్రారంభం.. నిరుపేద వైశ్య భక్తులకు అయోధ్య, కాశీ ఉచిత యాత్ర

కార్యక్రమాల్లో పాల్గొన్న యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, (సింగిడి): నగరంలో ఆదివారం నిర్వహించిన రెండు కార్యక్ర మాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉప మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొన్నారు.ముకరంపురలోని పరివార్ బేకరీ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘టీ.ఎస్. బీమా కేంద్రం’ కార్యాలయాన్ని ప్రారంభించి, నిర్వాహకుడు షాకీర్‌కు శుభాకాం క్షలు తెలిపారు. ద్విచక్ర, నాలుగు చక్రాల, వాణిజ్య వాహనాలకు బీమా సేవలు అందుబా టులో ఉన్నాయని, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం వైశ్య భవన్ వద్ద గంప నారాయణ స్మారక ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో నిరుపేద వైశ్య భక్తుల కోసం ఏర్పాటు చేసిన అయోధ్య, కాశీ ఉచిత యాత్రను మానకొండూరు శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.గంప శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో వరుసగా మూడో ఏడాది ఈ యాత్రను నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఎనిమిది రోజుల పాటు సాగే యాత్రలో రెండు ప్రత్యేక బస్సుల ద్వారా సుమారు 45 కుటుంబాల సభ్యులను ఉచితంగా పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. భక్తుల యాత్ర సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాజిద్ హుస్సేన్, ఇబ్రహీం, పడాల అజయ్ శ్రీజ, ఎన్నం ప్రకాష్, గాజ శివరాం, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, వైశ్య సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కాలనీవాసులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

సరస్వతినగర్‌లో రూ.40.70 లక్షల పనులకు భూమిపూజ, అలుగునూరులో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం..నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, (సింగిడి):నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 2, 8వ డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2వ డివిజన్ సరస్వతినగర్‌లో రూ. 40.70 లక్షల నిధులతో చేపట్టనున్న మురుగునీటి పైపులైను, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. 8వ డివిజన్ అలుగునూరులో స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశంతో కలిసి వారపు సంతలను ప్రారంభించారు. ఎస్సీ సామాజిక భవనం వద్ద అభివృద్ధి పనులు, బస్సు నిలయాలను ప్రారంభించడంతో పాటు తాగునీటి సౌకర్యం కోసం బోరుబావుల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని 66 డివిజన్లలో రూ. 50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో పట్టణ సవాళ్ల నిధి కింద నగరపాలక సంస్థకు రూ. 840 కోట్లు మంజూరయ్యాయని, ప్రాజెక్టు నివేదికకు ఆమోదం లభించడంతో త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.వీధికుక్కల సమస్య పరిష్కారానికి జంతు జనన నియంత్రణ కేంద్రం సామర్థ్యాన్ని పెంచేందుకు సుమారు రూ. 2 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.



వారపు సంతలు ప్రజలకు సౌకర్యం కల్పించడంతో పాటు చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెంచుతాయని పేర్కొన్నారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు భాయీజీకి మేయర్ ఘన నివాళి

డా. ఎస్.ఎన్. సుబ్బారావు ఐదో వర్ధంతి కార్యక్రమాలు ప్రారంభం



కరీంనగర్, (సింగిడి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ‘చంబల్ గాంధీ’గా పేరొందిన డా. ఎస్.ఎన్. సుబ్బారావు (భాయీజీ) ఐదో వర్ధంతి సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘన నివాళులర్పించారు. తీగలగుట్ట పల్లిలోని మేయర్ శిబిర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అక్టోబర్ 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న భాయీజీ, జీవితాంతం దేశసేవకు, గాంధేయ సిద్ధాంతాల ప్రచారానికి అంకితమయ్యారని కొనియాడారు. చంబల్ లోయలో బందిపోట్లుగా జీవించిన వారిని అహిం సా మార్గంలోకి తీసుకొచ్చి, జనజీవన ప్రవాహంలో కలిసేలా కృషి చేశారని గుర్తుచేశారు.యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందిం చేందుకు జాతీయ యువజన ప్రాజెక్టు ద్వారా కృషి చేశారని, జాతీయ సమైక్యత, మతసామరస్యం, సామాజిక బాధ్యతను చాటిచెప్పారని పేర్కొన్నారు. భాయీజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జాతీయ యువజన ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు కే. యాదవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గడ్డం జగదీష్, రవీందర్, గాజ శివరాం, ఎన్నం ప్రకాష్, గాంధ్ల నరేష్, వడ్డేపల్లి రాజు, కొలగాని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడికి దక్కిన అరుదైన గౌరవం

ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా డాక్టర్ అంకం సుధాకర్

జమ్మికుంట, (సింగిడి):: జమ్మికుంట పట్టణానికి చెందినప్రముఖ పిల్లల వైద్యుడు, ఐఎంఏ హుజురాబాద్ జమ్మికుంట శాఖ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ అంకం సుధాకర్ కు ఐఎంఏ రాష్ట్ర పదవి వరించింది. ఐఎంఏ హుజురాబాద్ జమ్మికుంట శాఖ అధ్యక్షునిగా మన్ననలు అందు కున్న తర్వాత రాష్ట్ర ఐఎంఏ ప్రతినిధుల అభ్యర్థన మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పోటీలో నిలిచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఈ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఐఎంఏ కార్యకలాపాలను మరింత మెరుగుపరచడమే కాకుండా రాష్ట్రకార్యవర్గంతో అనుసంధానించడా నికి ఒక వారధిగా పనిచేసే అవకాశం తనకు



కలిగిందని వెల్లడించారు. ఈ సందర్భంగా పలు వురు ప్రముఖులు, సహచర డాక్టర్లు.. సుధాకర్‌ను అభినందించారు. తన విజయానికి సహకరించిన ఐఎంఏ ప్రతినిధులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఐఎంఏ శాఖ అధ్యక్షుడిగా గతంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డాక్టర్ సుధాకర్ చక్కటి పేరు గడించారు. వృత్తినే దైవంగా భావించి 24/7 అందుబాటులో ఉన్న జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలకు నిత్యం సేవలందించే డాక్టర్ అంకం సుధాకర్ కు ఐ ఎం ఏ రాష్ట్ర పదవి రావడం పట్ల స్థానికులు, పలువురు వర్షం వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హుజురాబాద్ జమ్మికుంట శాఖ అధ్యక్షుడిగా చక్కటి సేవలు అందించిన సుధాకర్.. రాష్ట్ర వారు కార్యవర్గ సభ్యునిగా కూడా మరింత విస్తృతంగా సేవలందిస్తారని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం..

ఆలయాల్లో అమరవీరుల ఆత్మశాంతికి ప్రత్యేక ప్రార్థనలు



జమ్మికుంట, (సింగిడి):: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని ఇల్లంద కుంట ఎస్సై క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే పోలీసు సిబ్బందికి ఆయురా రోగ్యాలు, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భం గా ఇల్లందకుం టలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంతో పాటు సిరిసేడు చర్చి, మసీదులో ప్రత్యేక ప్రార్థ నలు నిర్వహించి అమరవీరుల త్యాగాలను స్మరించుకు న్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్ర తల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొ న్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమం, పోలీసు సిబ్బంది శ్రేయస్సు, ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

పోలీసు అమరవీరుల స్మరణార్థం 20 కి.మీ. సైకిల్ ర్యాలీ

అక్టోబర్ 31 వరకు సంస్మరణ వారోత్సవాలు ప్రజలు, విద్యార్థులు భాగస్వాములు కావాలి: సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, (సింగిడి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆదివారం 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పోలీసు పరేడ్ మైదానంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో సైక్లిస్టుల సంఘం సభ్యులు, వైద్యులు, పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. పోలీసు పరేడ్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా తిరిగి అదే మైదానా నికి చేరుకుని ముగిసింది. సీపీ మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీ రుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. అక్టోబర్ 31 వరకు నిర్వహించే సంస్మరణ వారోత్సవాల్లో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమం లో ఏసీపీలు వెంకట స్వామి, విజయకుమార్, సైక్లిస్టుల సంఘం అధ్యక్షుడు మహేష్ పాసుల, డాక్టర్ కిరణ్, న్యాయవాది తిరుపతి, పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరపోలీసుల త్యాగాలు చిరస్మరణీయం: సీపీ గౌష్ ఆలం

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కరీంనగర్, (సింగిడి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల ఆత్మశాంతి, వారి కుటుంబాల క్షేమం, పోలీసు సిబ్బంది సంక్షేమం, ప్రజలందరి శ్రేయస్సు, సమాజంలో శాంతి సామరస్యాల కోసం చర్చి ప్రతినిధులతో కలిసి ప్రార్థించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సమాజ శాంతి కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, పట్టణ, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత ఒక్కటైన స్నేహబృందం

చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల చిరుకానుక



మల్లాపూర్, (సింగిడి):జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001–2002 పదో తర గతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. పదో తర గతి పూర్తి చేసుకుని 25 ఏళ్లు పూర్తయిన సందర్భం గా పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపు కున్నారు.

గ్రంథాలయం ప్రారంభం..

భావితరాలకు కానుక

తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు, తమ గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రంథా యాన్ని ఈ సందర్భంగా ప్రారంభించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు రిబ్బన్ కట్ చేసి గ్రంథాల యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, అతిథులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యా ర్థులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయో గపడేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, విజ్ఞానాన్ని విస్తరించడం, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించడం గ్రంథాలయ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

పాత జ్ఞాపకాలతో సందడిగా ఆత్మీయ సమ్మేళనం

25 ఏళ్ల తర్వాత కలుసు కున్న స్నేహితులు పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాప కాలను నెమరువేసుకుం టూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, భావి తరాల విద్యార్థుల ప్రయోజనానికి పూర్వ విద్యార్థులు చేపట్టిన గ్రంథాలయ ఏర్పాటు అభినందనీయమని ఉపాధ్యాయులు, అతిథులు, గ్రామస్థులు ప్రశంసిం చారు. స్నేహబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయో గపడే సేవా కార్యక్రమంతో ప్రత్యేకతను సంతరించు కున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యా యులు రహీమాన్ సార్, బాపూరావు సార్, సురేష్ సార్, పద్మాకర్ రావు సార్, శ్రీనివాస్ సార్, మురళి సార్, రాందాస్ సార్, వెంకటరమణారెడ్డి సార్, స్వామి సార్, నర్సారెడ్డి సార్, మల్లయ్య సార్‌తో పాటు 2001--2002 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మణికొండలో ప్రభుత్వ భూమిని రక్షించాలి

సీతారాం దూలిపాళ్ల డిమాండ్

రాజేంద్రనగర్, (సింగిడి): నాసింగి సర్కిల్, మణికొండ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీతారాం దూళిపాళ్ల డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారుల తీరును ప్రస్తావించారు.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రికార్డుల ప్రకారం.. మణికొండ జాగీర్‌లోని సర్వే నం. 42లో, పంచవటి కాలనీ కమాన్ పక్కనే ఉన్న సుమారు 1,450 చదరపు గజాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తక్షణమే గుర్తించాలని ఆయన కోరారు. ఆ భూమిని వెంటనే సర్వే చేసి, స్పష్టమైన హద్దులను నిర్ధారించి బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భూములను కబ్జాదారుల బారి నుంచి రక్షించేందుకు రెవెన్యూ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా సమన్వయంతో వ్యవహరించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

స్పందించకుంటే శాంతియుత ఆందోళనలు తప్పవు

ప్రభుత్వ భూమిని కాపాడటంలో అధికారులు ఒకవేళ విఫలమైతే.. ప్రజా ఆస్తులను రక్షించుకునే నిమిత్తం శాంతియుత ధర్నా చేపట్టడం మినహా తమకు మరో మార్గం ఉండదని ఆయన హెచ్చరించారు. “ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి దానిని రక్షించడం అధికారుల ప్రధాన బాధ్యత” అని ఆయన స్పష్టం చేశారు.

గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణంపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు సమీక్ష.. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు





మహాదేవపూర్, (సింగిడి): గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధిపనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణపనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుఅధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లిజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరంలో పర్యటించిన ఆయన వివిధశాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదనిస్పష్టం చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి, అన్ని నిర్మాణాలనుసమాంతరంగా చేపట్టాలని సూచించారు. అవసరమైన సంఖ్యలో కార్మికులను నియమించిషిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకుఅనుగుణంగా జరగాలని పేర్కొన్నారు. నిర్మాణాల్లో ఎలాంటి మార్పులు,వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలనిసూచించారు. కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను తప్పనిసరిగా వినియోగించాలని,గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలనిఆదేశించారు.

మంత్రి పర్యటనలోగా పనుల్లో పురోగతి కనిపించాలి

వచ్చే నెల 4న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళేశ్వరం పర్యటనకురానున్ననేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలనికమిషనర్ అధికారులకు సూచించారు. నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు

గోదావరి పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులుతరలివచ్చే అవకాశం ఉన్నం





దున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయా లని హనుమంతరావు సూచించారు. తాగునీరు, రహదా రులు, పార్కింగ్, వీఐపీఘాట్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయా లని తెలిపారు. గత పుష్కరాల సందర్భంగాఎదురైన సమస్య లను దృష్టిలో ఉంచుకుని పటిష్ఠమైన కార్యాచరణ రూపొందిం చాలన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాచ్ టవర్లు,చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, పుష్కరఘాట్లకు ఇరువైపులా ర్యాంపులునిర్మిం చాలని ఆదేశిం చారు. గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తులభద్ర తకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచిం చారు. అన్నిశాఖలు సమన్వయం తో పనిచేస్తూ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్‌శర్మతో పాటు దేవాదాయ, నీటిపా రుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకుచెందిన ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై కదం తొక్కిన మహిళలు.



ధర్మారం (సింగిడి):మండలంలోని కమ్మరి ఖాన్ పేట గ్రామంలో ఈరోజు మద్యం షాపులు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఇక నుండి తమ గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహి స్తున్నారని, అలాగే గంజాయి ని కూడా విక్ర స్తున్నా రని అనుమా నాలు ఆ గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మద్య ప్రభావంతో గత బుధవారం రోజున జవ్వాజి రాధాకృష్ణ అనే యువ కుడు మద్యశే మత్తులో ఆజాగ్రత్తగా వాహనం నడిపి మృతి చెందిన సంఘటన ఆ గ్రామంలో చోటుచేసుకుంది. ఇక నుండి అయినా యువకులు పురు షులు మద్య మహమ్మారికి బలి కావద్దని ఉద్దేశంతో ఈరోజు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆదేశానుసారం మాజీ సర్పంచ్ గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఇంటి కోక్క మహిళ కదలి వచ్చి భారీ ఎత్తున ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఇకపై తమ గ్రామంలో ఎవరైనా మద్యంతో పాటు ఊరిలో సిగరెట్లు గాని సిమ్లా లు అంబార్లు వచ్చే నవంబర్ నుండి విక్రయించినట్ల యితే భారీజ రీమాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తా

వినియోగదారుల, మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్



పెద్దపల్లి, (సింగిడి): విని యోగదారుల హక్కుల పరిరక్షణ, మానవ హక్కుల సంరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లపెల్లి విజయసాగర్ తెలిపారు. వినియోగదారుల, మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆర్.కె. జైన్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహారా బాను సూచనలతో నియామకం ఖరారైంది. విజయసాగర్ మాట్లా డుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాన న్నా రు. అధికారుల నుంచి స్పందన లేని సందర్భాల్లో బాధితులకు అం డగా నిలిచి, న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. విని యోగదా రుల, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన పెం పొం దించడంతో పాటు హక్కుల ఉల్లంఘనకు గురైన వారికి చట్ట బద్ధ మైన మార్గాల్లో సహకరిస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరి ష్కా రం కోసం సంబంధిత శాఖలకు వినతిపత్రాలు అందించి, బాధి తు లకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. తనకు రాష్ట్రస్థాయి బాధ్య తలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కె. జైన్, రాష్ట్ర అధ్యక్ష రాలు డాక్టర్ సహారా బానులకు విజయసాగర్ కృతజ్ఞతలు తెలిపా రు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

పోలీసింగ్ వ్యవస్థ ను మరింత పటిష్టం చేయాలి

ప్రజలకు వేగవంతమైన సేవలందించాలి..సిబ్బంది పనితీరుపై సీపీ గౌష్ ఆలం సమీక్ష





జమ్మికుంట, (సింగిడి):ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీస్ సేవలందిస్తూ పోలీసింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. శనివారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించి స్టేషన్ నిర్వ హణ, సిబ్బంది పనితీరు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి హుజూ రాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు.తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలు, కేసు రికార్డులు, కేసు ఆస్తుల భద్రతను పరిశీలించిన సీపీ.. సిబ్బంది విధులు, క్షేత్రస్థాయి పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను క్రమబద్ధీకరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, పరిధిలోని నిఘా కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక పోలీస్ పరికరాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపయోగంలో లేని పాత సామగ్రిని కమిషనరేట్‌కు తరలించి స్టేషన్ ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలు సుశీలకు అధికారుల నివాళి



భీమదేవరపల్లి, (సింగిడి): గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించిన పారిశుద్ధ్య కార్మికురాలు తూముల సుశీల అకాల మరణం గాంధీనగర్ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆమె మరణవార్త తెలుసుకున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వీరేశం, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) నాగరాజ్ ఆమె స్వగృహానికి చేరుకుని భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పరిధిలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు గ్రామ అభివృద్ధిలో సుశీల కీలక పాత్ర పోషించారని కొనియాడారు. విధుల పట్ల నిబద్ధతతోపనిచేస్తూగ్రామ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె మృతి తీరని లోటని, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం సుశీల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, తోటి పారిశు ద్ధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొని సుశీలకు కన్నీటి నివాళులర్పించారు.

మా గల్లీలో డ్రైనేజీ వేయించండి..

1వ వార్డు ప్రజల ఆవేదన!

రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు.. దుర్వాసనతో ఇబ్బందులు

దోమల బెడదతో రోగాల భయం.. పట్టించుకునే వారేరీ?

తొర్రూరు, (సింగిడి):
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని ఒకటో వార్డులో డ్రైనేజీ సమస్యప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మురుగునీరు సాఫీగా వెళ్లేందుకుసరైన సైడ్ కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్లపైకిచేరుతోంది. దీంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నా మని, నిత్యం అనేకఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంఅభివృద్ధి చెందుతున్నప్పటికీ తమ గల్లీలో మాత్రం కనీస డ్రైనేజీ సౌకర్యంలేక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



రోడ్లపై నిలిచిపోతున్న మురుగునీరు

వార్డులోని కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు వెళ్లేందుకు సరైన మార్గంలేకపోవడంతో రోడ్లపైనే నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగాఅన్నారం రోడ్డులో మురుగునీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు రాకపోకలుసాగించేందుకు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. వాహనదారులు, పాదచారులు ఈ సమస్య తో అవస్థలు పడుతున్నారని పేర్కొంటు న్నారు. మురుగునీరునిల్వ ఉండటంతో పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొం టోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

దోమల వ్యాప్తితో ప్రజల్లో ఆందోళన

మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితులు ఎదురవుతున్నా యని, చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందేమోనని భయపడుతు న్నామని



చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారు తోందని, వర్షపు నీరు, మురుగునీరు కలసి రోడ్లపై నిలిచిపోవడంతో సమస్యతీవ్రత పెరుగుతోందని పేర్కొంటున్నారు.

పట్టించుకునే వారేరీ?



డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పలు మార్లు కోరుతున్నప్పటికీ తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో సమస్యను పక్కన పెట్టకుండా, మురుగునీరు సక్రమంగా వెళ్లేలా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం స్పందించాలి

తొర్రూరు పట్టణంలోని ఒకటో వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత అధికారులు తక్షణమేస్పందిం చాలని స్థానికులు కోరుతున్నారు. ముం దుగా అన్నారం రోడ్డులోనిలిచిపో యిన మురుగునీటిని తొలగించి, అవసరమైన చోట్ల సైడ్ కాలువలునిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వార్డులోని గల్లీలను పరిశీలిం చి, మురుగు నీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గల్లీలో డ్రైనేజీ సౌకర్యం కల్పించి, మురుగు నీటి సమస్య నుంచి విముక్తి కల్పించాలని ఒకటో వార్డు ప్రజలువిజ్ఞప్తి చేస్తున్నారు.

మాదారంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ భీమేష్



మహాముత్తారం, (సింగిడి): గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా కాటారం సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మాదారం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈ. భీమేష్, అదవిముత్తారం ఎస్ఐ జి. రమేష్ ఆధ్వర్యంలో పోలీసు, తెలంగాణ ప్రత్యేక పోలీసు (టీజీఎస్పీ) సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ భీమేష్ మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. గుడుంబా తయారీ, విక్రయం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారితో పాటు వన్యప్రాణులను వేటాడే వ్యక్తుల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకురావా లని కోరారు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, అక్రమ కార్యకలాపాల అరికట్టడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

వన్యప్రాణి వేటగాడిపై కేసు నమోదు



మహాముత్తారం, (సింగిడి):వన్యప్రాణులను వేటాడేం దుకు ఉపయోగించే సామగ్రి, దుప్పి కొమ్ములు లభ్యమైన నేపథ్యం లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యమన్‌పల్లికి చెందిన దాగం మహేష్‌పై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు.

కాటారం రేంజ్ అధికారి జాడి స్వాతి

తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కాటారం సీఐ భీమేష్ ఆధ్వర్యంలో యమన్‌పల్లిలోని వేటగాళ్ల ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో దాగం మహేష్ ఇంట్లో దుప్పి కొమ్ము లు, వేటకు ఉపయోగించే విద్యుత్ ఉచ్చులు, క్లచ్ వైర్లు, ఇతర సామ గ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితు డిని కాటారం రేంజ్ అటవీశాఖ అధికారులకు అప్పగిం చారు. ఈ ఘట నపై విచారణ చేపట్టిన అటవీశాఖ అధికారులు శనివారం వన్యప్రా ణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు రేంజ్ అధికారి జాడి స్వాతి వెల్లడించారు.

డాక్టర్ రాజలింగంకు వాసవి క్లబ్ సన్మానం



బిక్కనూర్, (సింగిడి):జర్నలిజం రంగంలో విశేష సేవలందించి డాక్టరేట్ పట్టా పొందిన ప్రముఖ పాత్రికేయులు డాక్టర్ దన్నారపు రాజలింగంను వాసవి క్లబ్ కామారెడ్డి గ్రేటర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినం దించారు. జర్నలిజం రంగంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీ యమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కామారెడ్డి గ్రేటర్ అధ్యక్షుడు చింతగారి శ్రీనివాస్ గుప్తా (బొమ్మరిల్లు), కార్యదర్శి తాటిపల్లి సునీల్ గుప్తా (కుబ్బి), కోశాధికారి తోట శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

కమలాపూర్‌లో ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం



కమలాపూర్, (సింగిడి): ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా, శనివారం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండాలనే లక్ష్యంతో శనివారం మొదటి రోజు 60 ఇండ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మం డల పంచాయతీ అధికారి చేతన్ రెడ్డి, ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, ఈ ఓ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు మార్క అశోక్, పిల్లి సతీష్, అవునూరి తిరుపతి, ఎండపెల్లి మల్లారెడ్డి , రాంశెట్టి రాజయ్య, గంధసిరి అనీల్, గంధసిరి బిక్షపతి, మౌటం నాగరాజు, షేక్ కాశీం, మౌటం సంపత్, పచిమట్ల కుమార్, గంధసిరి శివ, బైరి రాజేష్, కాల్వ కుమార్, చందర్ సింగ్,ప్రజలు పాల్గొన్నారు.

రైతులు కూరగాయలు మొక్కజొన్న పంటలు వేసుకోవాలి

నీటి లభ్యత తగ్గి భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి: వ్యవసాయ సహాయ సంచాలకులు ఆదిరెడ్డి

కమలాపూర్,(సింగిడి): రైతులు వచ్చే రబీ సిజన్లో వరి పంటను వేసుకోవద్దని ఆరుతడి పంటలు వందరోజుల పంటలు,కూరగాయలు, మొక్కజొన్న పంటలు సాగు వేసుకోవాలని హనుమ కొండ జిల్లా సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు ఆదిరెడ్డి తెలిపారు. సాగుభూమి సంరక్షణ కార్యక్ర మంలో భాగంగా శనివారం మండలంలోని గుం డేడు, మద్రిపల్లి గూడెం, శనిగరం గ్రామాల్లో పంట లను పరిశీలించారు. మద్రిపల్లిగూడెం గ్రామంలో వరి పంటను పరిశీలించి,వరి పంటలో వచ్చే తెగుళ్లను చీడపీడలను నివారించుటకు రైతులకు సూచనలు చేశారు. శనిగరం గ్రామంలో పత్తి పంట కోత ప్రయోగం ను పరిశీలించారు. అనంతరం గుండెడులో ఆదిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వలన ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగు తున్న, కారణంగా నీటి లభ్యత చాలావరకు తగ్గిపోతుందన్నారు. రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలన్నారు. వరి పంటను వేసుకో కూడదు అని సూచించారు. అలాగే మేల్ ఫిమేల్ వరి విత్తనాలను వేసినా కూడా పంట దిగుబడి చాలా వరకు తగ్గుతుందని రైతులకు సూచించారు. ఉష్ణోగ్ర తలు అధికంగా ఉండడం వలన పాలినేషన్ తక్కువగా జరుగుతుంది కావున పంట దిగుబడి తగ్గిపో తుందని సూచించారు. జీరో తిలేజ్ మొక్కజొన్న పద్ధతిని సాగు చేయాలని సూచించారు. అదేవి ధంగా 100 నుండి110 రోజుల పంటలను మాత్రమే సాగు చేయాలని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటు పోతున్నందువల్ల నీటి లభ్యత తక్కువగా ఉంటుం దని, కావున తక్కువ నీటిని వినియోగించే పంటలై నటువంటి మొక్కజొన్న, కూర గాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచిం చినారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి బి వేణు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి తిరుపతి, జయప్రకాష్ రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, రైతులు పాల్గొన్నారు .





రక్తదాన శిబిరంలో పాల్గొన్న భీమదేవరపల్లి యువత



భీమదేవరపల్లి, (సింగిడి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట డివిజన్ పరిధిలోని మడికొండ గార్డెన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో భీమదేవరపల్లి మండల యువత పాల్గొన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ కుమార్ యాదవ్ యువతను సమన్వయం చేసి శిబిరం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా జక్కుల అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ఒక ప్రాణాన్ని కాపాడటంతో సమానమని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచు కొని, అర్హత ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. రక్తదానం చేసిన యువతను ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అభినందించారు. యువత సామాజిక సేవా కార్యక్రమా ల్లో ముందుండాలని ముల్కనూర్ ఎస్సై రాజు పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో రాజేందర్, రాజేశ్, అజయ్ కుమార్, వినోద్, హరీష్, సందీప్, కృషిధర్, జయంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి..
రక్తదానంతో మానవత్వానికి స్ఫూర్తి
రక్తదాతలను అభినందించిన బిక్కనూర్ సీఐ నరేష్



బిక్కనూర్,(సింగిడి): తెలంగాణ పోలీస్ అమరవీ రుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బిక్కనూర్ మండలానికి చెందిన ఏడుగురు రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సంద ర్భంగా రక్తదానం చేసిన రాము, భూమేష్, రామచంద్రం, అహ్మద్, శేఖర్, గడ్డం రాజేందర్, సునీత చౌహాన్‌లను బిక్క నూర్ సీఐ జె. నరేష్ అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి రక్తదానం చేసిన దాతలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారని సీఐ నరేష్ పేర్కొన్నారు.

నిరుపేద క్రీడాకారుడికి అండగా నిలిచిన కడుదురి గంగారెడ్డి



బుగ్గారం, (సింగిడి):జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన గుంపుల హన్షల్‌కు కడుదురి గంగారెడ్డి రూ. 15 వేల ఆర్థిక సాయం అందించి తన ఉదారతను చాటు కున్నారు. అండర్-14 రెజ్లింగ్ విభా గంలో జాతీయస్థాయి పోటీలకు సిద్ధమ వుతున్న హన్షల్ నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో,పోటీలకు వెళ్లేం దుకు కనీస ప్రయాణ ఖర్చులు కూడా లేవని గ్రామ సర్పంచ్ గట్టు శారద గంగా రం తన మిత్రుడు కడుదురి గంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన గంగారెడ్డి బాలుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాలుడి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ గట్టు శారద గంగారం శాలువాతో సన్మానించా రు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థికి ఆర్థికంగా అండగా నిలిచిన కడుదురి గంగారెడ్డికి సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చట్ట శ్రీనివాస్, బుర్ర రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం రమేష్, బుర్ర నాగరాజు, పీఏంపీ డాక్టర్ నరేందర్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ యువకులు, హన్షల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు పెంచుకుందాం.. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం
పెద్దమల్లారెడ్డిలో పంట కుంట పనుల పరిశీలన.. రైతు భిక్షపతిని అభినందించిన జిల్లా కలెక్టర్





బిక్కనూర్, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామస్థాయిలో జల సంరక్షణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. పెద్దమల్లారెడ్డిలో వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా చేపట్టిన పంట కుంట పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ గిరి, డివిజన్, మండల స్థాయి అధికారులు పరిశీలించి, రైతు సింగిలి భిక్షపతిని అభినందించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఏర్పాటు చేయడంతో పాటు బోరుబావుల రీచార్జ్ పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడూరు సాయిగౌడ్, ఉప సర్పంచ్ చైతన్య కొండల్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు బాగారెడ్డి, ఈఓ లక్ష్మి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఉద్యోగ అవకాశాలు
జీవనోపాధి సేవా కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ సీఆర్‌పీ పోస్టుల భర్తీ



భీమదేవరపల్లి, (సింగిడి):
గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం, పశుసంపద ఆధారిత జీవనోపాధిని బలోపేతం చేయడం లక్ష్యంగా అమలు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ క్లస్టర్ అప్రోచ్ (ఐఎఫ్‌సీ) ప్రాజెక్టులో భాగంగా రెండు రకాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమదేవరపల్లి ఏపీఎం వేణు తెలిపారు. జీవనోపాధి సేవా కేంద్రం (ఎల్ఎన్‌సీ) కోఆర్డినేటర్, సీనియర్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీనియర్ సీఆర్‌పీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులకు సేవలందించడమే లక్ష్యం
ఐఎఫ్‌సీ ప్రాజెక్టు ద్వారా రైతులకు పంటల సాగులో మెరుగైన పద్ధతులపై అవగాహన కల్పించడం, వ్యవసాయ ఉత్పాదక తను పెంచడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) ఏర్పాటుకు సహక రించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అవసరమైన సేవలు, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడా నికి జీవనోపాధి సేవా కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయి.

ఎల్ఎన్‌సీ కోఆర్డినేటర్ అర్హతలు
జీవనోపాధి సేవా కేంద్రం కోఆర్డినేటర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బుక్‌కీపింగ్, ఖాతాల నిర్వహణ, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలపై అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయగలగాలి.

సీనియర్ సీఆర్‌పీ పోస్టుకు డిగ్రీ తప్పనిసరి
సీనియర్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పోస్టుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, జీవనోపాధి కార్యక్రమాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. ఐఎఫ్‌సీ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సమాఖ్యలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది.

వేతన వివరాలు..
సీనియర్ సీఆర్‌పీ పోస్టుకు నెలకు రూ. 10 వేల వేతనం చెల్లించనుండగా, జీవనోపాధి సేవా కేంద్రం కోఆర్డినేటర్ పోస్టుకు నెలకు రూ. 8 వేల వేతనం అందించనున్నారు.

దరఖాస్తులకు అక్టోబర్ 29 చివరి తేదీ
అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను 2026 అక్టోబర్ 29వ తేదీలోగా సమర్పించాలి. భీమదేవరపల్లి మండల సమాఖ్య లోఅభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాల్సిన ప్రాంతాలుగా నోటీసులో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణికి మండల స్థాయి
అధికారులే హాజరు కావాలి
కింది స్థాయి సిబ్బందిని పంపిస్తే సహించేది లేదు
ప్రజావాణికి గైర్హాజరైతే చర్యలు తప్పవు
ప్రజావాణి గొప్ప కార్యక్రమం: ఎంపీడీవో సురేష్ కుమార్



హుస్నాబాద్ (సింగిడి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి గొప్ప వేదికగా నిలుస్తుందని హుస్నాబాద్ ఎంపీడీవో సురేష్ కుమార్ అన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుం దని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై తమ ఫిర్యాదులను అందించే అవకాశం ప్రజావాణి కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. తమ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలకు సమాధా నం చెప్పడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అధికారులు స్వయంగా హాజరుకాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజావాణి ప్రాధాన్యతను గుర్తించి ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించా లని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కింది స్థాయి సిబ్బందిని పంపించే శాఖలపై శాఖాపరమైన చర్యలు తీసుకుం టామని ఎంపీడీవో సురేష్ కుమార్ స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌ను పరామర్శించిన వొడితల సతీష్ కుమార్

మోకాలి శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా



హుస్నాబాద్ (సింగిడి):హుస్నాబాద్ నియోజక వర్గం అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ మోకాలి శస్త్రచికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న నేపథ్యంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లి పరామ ర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలి



ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండలాన్ని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు, ముఖ్యంగా మహిళలు సమిష్టిగా ఏరుగట్ల మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలం గా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీర్చిదిద్దాలని ఆర్మూర్ డి ఎల్ పి ఓ, ఏరుగట్ల మండల ప్రత్యేక అధికారి శివకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తాసిల్దార్ మల్లయ్యలు కోరారు. శనివారం ఏరుగట్ల మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో 45 రోజుల మండల సర్వసభ్య సమీక్ష సమావేశం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధికారులు మాట్లాడుతూ, ఎలినీనో దేశవ్యాప్తంగా ప్రభావం వల్ల ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లు, గ్రామాల జిపిఎల్, మండల అధికారుల సహకారంతో ప్రత్యేకంగా తాగునీటి, సాగునీటి వృధా కాకుండా చూడాలని, విద్యుత్ను పొదుపుగా వాడేలా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ఎయిర్ గట్ల మండలంలో కిరాణా షాపులలో గాని, హోటల్లో గాని, ఇతరాత్ర దుకాణాలలో గాని ప్లాస్టిక్ విక్రయించకుండా కఠిన చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, చాలా గ్రామాలలో ప్లాస్టిక్ నియంత్రించి, ప్లాస్టిక్ స్థానంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగిస్తున్నారని అధికారులు అన్నారు. ప్లాస్టిక్ ఇస్తార్లు, హోటల్లో ప్లాస్టిక్ టీ, కప్పులు గాని, కిరాణా దుకాణాలలో ప్లాస్టిక్లు విక్రయించకుండా సమిష్టిగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వచ్చే మళ్లీ సర్వసభ్య సమావేశానికి ఏరుగట్ల మండలాన్ని ప్లాస్టిక్ నియంత్రణ మండలం గా తీర్చిదిద్దాలని వారు కోరారు. ప్లాస్టిక్ వాడకంపై జిల్లా కలెక్టర్ ప్రతివారం ఎక్కడెక్కడ ప్లాస్టిక్ విక్రయిస్తున్నారు, వాడకం ఏ ఏ గ్రామాల్లో జరుగుతుంది అనే విషయాలపై సమాచారం తెలుసుకోవడమే కాకుండా ఉన్నత అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. ఒకవేళ ప్లాస్టిక్ విక్రయాలు జరిగితే జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని, సర్పంచులు,కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల మణులు ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేసి ప్లాస్టిక్ ను నియంత్రించి, ప్రతి గ్రామంలో సర్పంచులు బట్టల బ్యాగులను పంపిణీ చేయాలని మండల అధికారులు కోరారు. ముఖ్యంగా విశాలమైన ప్రభుత్వ పాఠశాలల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు 100 మొక్కలను నాటి చేయాలని, దీంతో పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడతాయని, ప్రతి పాఠశాలలో కనీసం 100 మొక్కలు నాటింపజేయాలని, మొక్కలు నాటడం వల్ల ఒకరికి ఉపాధి కల్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

తాడిచెర్ల నుంచి శబరిమలకు గురుస్వామి
మల్క మోహన్ రావు మహాపాదయాత్ర
ఘనంగా సాగనంపిన గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు



మల్హర్, (సింగిడి):: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచెర్ల గ్రామానికి చెందిన గురుస్వామి మల్క మోహన్ రావు 31వసారి అయ్యప్ప మాలధారణ చేసి, శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం మహాపాదయాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం 3గంటలకు తాడిచెర్ల గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి ఆయన పాదయాత్ర ప్రారంభమైంది. అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తితో ప్రతి సంవత్సరం మాలధారణ చేస్తూ వస్తున్న గురుస్వామి మోహన్ రావు 31వ సారి అయ్యప్ప మాలవేసి శబరిమల యాత్ర చేపట్టడంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గురుస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సాగనంపారు. ఈ కార్యక్రమంలో వేరమనే సంపత్ రావు, తిర్రి అశోక్ గౌడ్, రాజబాబు, కోట నవీన్, వెంకన్న, నాగరాజు, లింగారావు, సత్యనారాయణ, సుంకరి సాయి తదితరులతో పటు గ్రామంలోని అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో పాదయాత్ర ప్రారంభ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

ప్రశాంతంగా 45రోజుల మండల సర్వసభ్య సమావేశం



ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో మోర్తాడ్ మండల ప్రత్యేక అధికారి, డి.ఎల్. పి.ఓ. శివ కృష్ణ అధ్యక్షతన, 45 రోజుల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశం లో ఎంపీడీవో వెంకటేశ్వర రావు, తాసిల్దార్ మల్లయ్య అధికారుల సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్థానిక మండల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు విచ్చేశారు. ఈ సమావేశంలో మండల అధికారులు గ్రామాలలో గల సమస్యలను, ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల, కస్తూర్బా విద్యాలయం లో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులను అధికారులు చదివి వినిపించారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో గాని, వివిధ సమస్యలు ఉంటే ఆయా శాఖలలో నివేదికలను రూపొందించి అందించాలని, నివేదికలను జిల్లా కలెక్టర్కు పంపించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను, పూర్తయిన అభివృద్ధి పనులను అధికా రులు వివరించారు.ఏలినీనో ప్రభావం తీవ్రంగా నెలకొన్న నేపథ్యంలో ఆయా గ్రామాలలో నీటిని, విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, వృధా చేయవద్దని, వీటిపై ముఖ్యంగా ప్రత్యేక దృష్టి సర్పంచులు, కార్యదర్శులు దృష్టి సారించి కృషి చేయాలన్నారు. అంతేకాకుండా యాసంగిలో ఆరుతడి పంటలు పెసర, మినుము, కొర్రలు పలు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని అధికారులు వివరించారు. భూగర్భ జలాల పెంపుదల కోసం ఎత్తిపోయిన బోరు బావల వద్ద, ఇంకుడు గుంతలను, సోప్ పిట్స్, పాశిపౌండ్స్ అవసరమైన చోట సర్పంచులు కార్యదర్శులు కలిసి నిర్మించి భూగర్భ జలాల పెంపుదలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్లు, మండల కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎఫ్ఐ మరిపెడ మండల అధ్యక్షుడిగా ప్రసాద్ నియామకం
– కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్ గూగులోతు సూర్య ప్రకాష్



డోర్నకల్/మరిపెడ (సింగిడి):విద్యార్థుల హక్కుల సాధన, విద్యారంగ సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తున్న భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం (డీఎస్ఎఫ్ఐ) మరిపెడ మండల అధ్యక్షుడిగా ప్రసాద్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా బానోత్ ప్రసాద్‌కు డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్,రాష్ట్ర నాయకులు గూగులోతు సూర్య ప్రకాష్ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా నిలుస్తూ, మండలంలో డీఎస్ఎఫ్ఐని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, పెండింగ్ బకాయిల చెల్లింపు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలి అని వారు అన్నారు. జెన్ జి యువత ఆలోచనలకు పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలి అని, విద్యారంగంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమించాలి అని తెలిపారు.

కరువు కోరల్లో నల్లబెల్లి.. ఆదుకోవాలని డిమాండ్
సాగు, తాగునీటికి కటకట.. ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలి
సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం.



నల్లబెల్లి, (సింగిడి): వర్షాభావ పరిస్థితు లతో పంటలు ఎండిపోతూ, తాగునీటి సమస్య తీవ్రతరమవుతున్న నేపథ్యంలో నల్లబెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ ఆధ్వర్యం లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. మండల కేంద్రంలోని గ్రామపంచా యతీ ఆవరణలో మండల కార్యదర్శి పరికి కోర్నేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థి తుల కారణంగా మండలంలో కేవలం 25 శాతం విస్తీర్ణంలోనే వరి సాగు జరిగిం దని తెలిపారు. సాగు చేసిన వరి పంటలకు సైతం నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని, పత్తి దిగుబడులు తగ్గే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మొక్కజొన్న, మిర్చి పంటలు కూడా ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.

ఎకరానికి రూ. 30 వేల పరిహారం ఇవ్వాలి.
పంటలు సాగు చేయని ప్రతి ఎకరానికి రూ. 30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను రద్దు చేయడంతోపాటు ఇతర బ్యాంకు రుణాలపై వడ్డీ మాఫీ చేయాలని కోరారు. రైతుబంధు పథకాన్ని సమీక్షించి పేద, మధ్యతరగతి రైతులకు ఏడున్నర ఎకరాల వరకు ఎకరానికి రూ. 15 వేల చొప్పున అందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి,ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన
గ్రామపంచాయతీలకు సరిపడా నీరు అందుబాటు లో లేకపోవడంతో రానున్న రోజుల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేసే పరిస్థితులు,కనిపిస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటింటా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలను, మూసివేయా లని, ప్రభుత్వ ఆర్థిక వ్యయాన్ని,తగ్గించుకోవాలని సూచించారు.

విద్య, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు పూర్తి ఫీజు, రీయింబర్స్ మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వ రం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్ల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, వచ్చే జూన్ నాటికి సాగు, తాగునీటి అవసరాలకు నీటిని నిల్వ చేసేందుకు సిద్ధం చేయాలని కోరారు. నర్సంపేట నియోజకవ ర్గంలోని కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసు కొని నల్లబె ల్లిని ప్రత్యేకంగా కరువు మండలంగా ప్రకటించేలా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కృషి చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అధికారులకు ప్రజావాణిలో వినతిపత్రం అందించాలని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవంబరు 2న మండల కేంద్రంలో ర్యాలీ, సభ,నిర్వహించాలని నిర్ణయించా రు. ఈ సమావేశంలో చింతకింది కుమారస్వామి, నాగెల్లి ప్రకాష్, నాగెల్లి శ్రీనివాస్, కడియాల మనోహర్, కడియాల క్రాంతికుమార్, పాండవుల రాంబాబు, మామిండ్ల మోహన్‌రెడ్డి, కొనకటి వీరమల్లు, మామిండ్ల పెద్ద ఐలయ్య, బొద్దుల దశరథం, పెద్దబోయిన రాజన్న, నాగెల్లి అనిల్, పిట్టల ప్రవీణ్, వక్కల చంద్రమౌళి, బూస కుమారస్వామి, మార్త యాదగిరి, వేముల రాజు తదితరులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

మంగళవారం
27-10-2026



రొమాన్స్ చేయడం.. సోనాక్షి సిన్హా

భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ టాక్ షో 'సర్వింగ్ ఇట్ అప్ విత్ సానియా' సీజన్ 2 గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఐవిఎమ్ పాడ్‌కాస్ట్స్ నిర్మిస్తున్న ఈ షో మొదటి ఎపిసోడ్‌కి బాలీవుడ్ కపుల్ సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆన్ స్క్రీన్ రొమాన్స్ గురించి సోనాక్షి మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. కెమెరా ముందు రొమాన్స్ చేయడం తన దృష్టిలో ప్రపంచంలోనే అత్యంత కష్టమైన పనని ఆమె పేర్కొన్నారు. అయితే తన సొంత భర్తతో కలసి నటించేటప్పుడు మాత్రం తనకు చాలా హాయిగా, కంఫర్టబుల్‌గా ఉంటుందని తెలిపారు.

మనకు అత్యంత ఇష్టమైన వ్యక్తి పక్కన ఉన్నప్పుడు అలాంటి సన్నివేశాల్లో చేయడం చాలా సులభమవుతుందని చెప్పుకొచ్చారు. కానీ షూటింగ్ స్పాట్‌లో ఉన్నంతవరకు మాత్రం తమ ఇద్దరి ప్రవర్తన పక్కాప్రొఫెషనల్‌గానే ఉంటుందని వివరించారు. ఇక తన ట్రావెలింగ్ లైఫ్ గురించి స్పందిస్తూ, కెరీర్ ప్రారంభం నుండి ఏళ్ల తరబడి షూటింగ్‌ల కోసమే సంవత్సరంలో దాదాపు 25 నుంచి 30 వారాల పాటు ప్రయాణాలు చేస్తూ గడిపానని సోనాక్షి చెప్పారు. ఇక ఇప్పుడు విసుగొచ్చి ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే ఖాళీగా ప్రశాంతంగా ఉండటానికి మొగ్గు చూపుతున్నానని వెల్లడించారు.

క్షమాపణలు చెప్పినా.. తగ్గని విమర్శలు..

విశ్వక్ సేన్ ఎమోషనల్ పోస్ట్‌పై నెటిజన్లు ఫైర్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ మూవీ 'కల్ట్'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 30న థియేటర్లలోకి రాబోతోంది. వెంకటేష్ నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాతో పోటీగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా విశ్వక్ సేన్ హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో అభిమానులతో ఫోటోలు దిగేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో ఫ్యాన్స్ తరలిరావడంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది. ఒక్కసారిగా జనం పెరిగిపోవడంతో సరైన భద్రతా ఏర్పాట్లు లేక విశ్వక్ సేన్ ఈవెంట్ మధ్యలోనే వెళ్లిపోవాల్సి వచ్చింది. దీంతో ఎంతో ఆశగా వచ్చిన అభిమానులు ఫోటోలు దిగే అవకాశం దక్కక తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ సంఘటనపై విశ్వక్ సేన్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ నోట్ షేర్ చేస్తూ క్షమాపణలు కోరారు. ఈ సంఘటనపై విశ్వక్ సేన్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ నోట్ విడుదల చేస్తూ క్షమాపణలు కోరారు.



ఫ్యాన్స్ ఫోటో సెషన్ సమయంలో కలిగిన అసౌకర్యానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభిమానుల నుంచి వచ్చిన స్పందన, ప్రేమ తాము ఊహించిన దానికంటే చాలా ఎక్కువ అయ్యి అంచనాలు దాటాయని చెప్పారు. ప్రతీ ఒక్కరినీ కలవాలని అనుకున్నప్పటికీ సరైన ఏర్పాట్లు లేకపోవడం, ఒక్కసారిగా జనం ఎక్కువ కావడంతో కలవలేకపోయానని వివరించారు. తనతో ఫోటో దిగాలని వచ్చి అవకాశం దక్కక నిరాశతో వెనుదిరిగిన ఫ్యాన్స్ అందరికీ సారీ చెప్పారు. త్వరలోనే మరింత మెరుగైన ఏర్పాట్లతో ఇంకో ఫ్యాన్ ఫోటో సెషన్ ఏర్పాటు చేసి, ప్రతీ ఒక్కరికీ అవకాశం దక్కేలా చేస్తానని హామీ ఇచ్చారు. తనపై చూపిస్తున్న ప్రేమకు, ఎప్పుడూ అండగా నిలుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అయినప్పటికీ నెటిజన్ల నుంచి విమర్శలు మాత్రం ఆగడం లేదు. అభిమానులు ఎంత సంఖ్యలో వస్తారో ముందుగానే అంచనా వేసి తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాల్సిందని, అంత దూరం నుంచి వచ్చాక ఇప్పుడు సారీ చెప్పడం ఏంటని కొంతమంది మండిపడుతున్నారు.



బిగ్ చాన్స్ కొట్టేసిన శ్రీలీల.. ఫాంటసీ యాక్షన్ డ్రామాలో యంగ్ హీరోకు జోడీగా?

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు గత కొద్ది కాలంగా అదృష్టం కలిసిరావడం లేదు. ఆశించినంత స్థాయిలో విజయాలు అందుకోలేనప్పటికీ.. ఆమె పాపులారిటీ మాత్రం రవ్వంత కూడా తగ్గలేదు. భాషతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్న ఈ బ్యూటీ, ఇప్పుడు మరో మైండ్ బ్లాకింగ్ ఆఫర్‌ను తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. ఫాంటసీ యాక్షన్ డ్రామా చిత్రం 'మిరాయ్ 2' లో హీరోయిన్‌గా ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ రోల్ కోసం ఇప్పటికే శ్రీలీలకు స్క్రీన్ టెస్ట్ కూడా పూర్తయిందట. 'మిరాయ్' ఘన విజయం తర్వాత తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్‌లో రాబోతున్న ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమై శరవేగంగా సాగుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమాలో విలన్‌గా రానా దగ్గుబాటి నటిస్తుండటం విశేషం. ఇక తేజ సజ్జా - శ్రీలీల కాంబినేషన్ ఈ ఫాంటసీ మూవీకి భారీ హైప్‌ను తీసుకురావడం ఖాయమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737